# భారత శక్తి®
VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:40 హైదరాబాద్, గురువారం, 24 జూలై 2025 పేజీలు: 12 వెల: 1.00


## 'మహాలక్ష్మి'తో ఆర్టీసీ బలోపేతం

హైదరాబాద్: మహాలక్ష్మి పథకం కింద మహిళల ఉచిత ప్రయాణాలతో ఆర్టీసీ ఆర్థికంగా బలోపేతం అవుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ పథకానికి సంబంధించి జీరో టికెట్ల మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సంస్థకు చెల్లిస్తోందన్నారు. బుధవారం ఎంజీబీఎస్‌లో నిర్వహించిన మహాలక్ష్మి - మహిళల 200 కోట్ల ప్రయాణ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2,400 కొత్త బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసింది. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు 2,800 ఎలక్ట్రిక్ బస్సులను కొనేందుకు సంస్థ కసరత్తు చేస్తోంది. ఉచిత ప్రయాణమే కాదు.. బస్సులకు అతివలను యజమానులను చేశాం.

## నేటి భారతం..

సముద్రానికి చమురు పూస్తే జిడ్డు బడుతుందా?
హిమనగానికి బొగ్గుపూస్తే నల్లబడుతుందా?
తలుపులూ కిటికీలు ఎంతగా మూసుకొని ఉన్నా
తరుముకొచ్చే కాల వాహిని తిరిగిపోతుందా?
ముసురుకొచ్చే ముదిమి తన వల విసరకుంటుందా?

– ఆచార్య డా: సి. నారాయణ రెడ్డి..
( జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత )

# మాటల యుద్ధానికి ముహూర్తం ఖరారు



- ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు సరేనన్న సర్కారు
- 28న లోక్‌సభలో.. మరుసటిరోజు రాజ్యసభలో
- ఒక్కోసభకు 16 గంటలు కేటాయింపు
- విపక్షాల నిరసనలతో మూడోరోజూ స్తంభించిన పార్లమెంటు

దిల్లీ 23 జులై ( భారత శక్తి ) :బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై చర్చకు పట్టుబడుతూ లోక్‌సభలో ప్రతిపక్షాల ఆందోళన పాక్ ఉగ్రవాద స్థావరాల మీద మన సైన్యం ఇటీవల విజయవంతంగా

12లో



12లో

## బీసీ రిజర్వేషన్లపై భాజపాది ద్వంద్వ వైఖరి: సీఎం రేవంత్‌రెడ్డి

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..



- సరైన నైపుణ్యం కలిగి ఉండాలి.. లేకపోతే తెలుసుకోవాలి..
- గుర్తుతెలియని లింక్ లను ఓపెన్ చేయకూడదు..
- అపరిచిత ఫోన్ కాల్స్ కు జవాబు ఇవ్వకూడదు..
- టీనేజ్ పిల్లలపై ఒక కన్నేసి ఉంచాలి..
- మీ వ్యక్తిగత వివరాలు సోషల్ మీడియాలో పంచుకోవద్దు..
- ముఖ్యంగా అత్యాశకు పోవడం అతిపెద్ద పొరబాటు..
- లేని సుఖాలకోసం అర్రులు చాచడం అనర్థం..
- ఇంటర్ నెట్ లేని సమయంలో మనం ఎలా గడిపాం..?
- నేరస్తులు కొత్త పుంతలు తొక్కుతున్నారు..
- స్వీయ సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వండి..
- వాస్తవంలో జీవిస్తే ప్రపంచం మీకు అర్థం అవుతుంది..
- ఏదైనా అనుమానం వచ్చినప్పుడు పోలీసులను సంప్రదించాలి..

సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతోంది.. ప్రపంచం ముందడుగువేయడం సంతోషదాయకమే.. కానీ కొందరు దుర్మార్గులు టెక్నాలజీని అడ్డగోలుగా, తమకు అనుకూలంగా మలుచుకుని కేవలం నేర ప్రవృత్తితో.. స్వలాభంకోసం వినియోగిస్తున్నారు.. దీనికోసం తర తమ బేధాలు మరచి విశృంఖల పద్ధతులు అనుసరిస్తున్నారు.. ఈ క్రమంలో అమాయకులు బలైపోతుండటం చూస్తున్నాం.. ప్రభుత్వాలు, పోలీసులు ఎంతగా ప్రయత్నిస్తున్నా ఇలాంటి నేరగాళ్ళను కట్టడిచేయలేకపోతున్నారు.. దేశం కోసం ఉపయోగించాల్సిన మేధస్సును కొందరు నేర ప్రపంచంలో విహరించడానికి వినియోగిస్తున్నారు.. దీంతో పోలీసు వ్యవస్థ ఎంతగా ప్రయత్నిస్తున్నా కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తూ సైబర్ నేరగాళ్లు తప్పించుకుంటున్నారు.. వ్యవస్థకే వారు సవాల్ విసురుతున్నారు.. అయితే ఈ సైబర్ నేరాలు ఒక్కోసారి కొన్ని ప్రయోజనాలను అందిస్తాయని నిపుణులు చెబుతుండటం కొంతమేర ఆశ్చర్యానికి గురిచేసే అంశం.. " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ " వారు భారత శక్తి పాఠకుల కోసం అందిస్తున్న పరిశోధనాత్మక కథనం..

12లో




12లో




12లో

## సాధ్యం కానప్పుడు.. రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఎలా అంగీకరించారు?: మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్, 23 జులై ( భారత శక్తి భాజపా, భారత రాష్ట్ర సమితి పార్టీలు బీసీలకు వ్యతిరేకమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు భారత రాష్ట్ర సమితి మోకాలడ్డుతోందని విమర్శించారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. తాము పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు భాజపా ససేమిరా అంటోందని.. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఆ పార్టీకి ఇష్టం లేనట్లుగా ఉందన్నారు."బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చడం ఎందుకు సాధ్యం కాదు? అలాంటప్పుడు అసెంబ్లీలో భాజపా ఎమ్మెల్యేలు ఎందుకు అంగీకరించారు?బిల్లు ప్రతిపాదన దిల్లీకి చేరేసరికి ఎందుకు మాట మారుస్తున్నారు? భాజపా జాతీయ నాయకత్వం.. తమ అభిప్రాయాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నోటితో పలికిస్తూ పలాయనం చిత్తగిస్తోంది. బీసీ బిల్లు కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేస్తాం. ఈ నెల 25న జరగనున్న ఓబీసీల సదస్సులో రాహుల్ గాంధీ బీసీ గొంతుకై నిలవబోతున్నారు. బీసీ వ్యతిరేక పార్టీలైన భాజపా, భారత రాష్ట్ర సమితి నుంచి బీసీలంతా బయటకు రావాలి"అని మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

# కొత్త పరిశ్రమలు రావాలి.. యువతకు ఉపాధి దక్కాలి

### పారిశ్రామిక సంఘాల ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, 23 జులై ( భారత శక్తి తెలంగాణకు కొత్త పరిశ్రమలు రావాలి.. ఇక్కడి యువతకు ఉపాధి దక్కాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సచివాలయంలో సీఐఐ, ఫిక్కీ, ఎఫ్‌టీసీసీఐ, ఎలీప్, టిఫ్, టీఎస్‌టీఎంఏ తదితర పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో బుధవారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "తెలంగాణ పురోగతిలో భాగస్వాములవుతున్న పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటాం. రాష్ట్రంలోని ప్రతి పరిశ్రమను కాపాడుకుంటాం. ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఎంఎస్ఎంఈ రంగానికి అండగా ఉంటాం. అలాగే కార్మికుల ప్రయోజనాలను కాపాడుతాం. పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారింది. ఏడాదిన్నర వ్యవధిలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రానికి కొత్తగా రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకొచ్చాం. ప్రైవేట్ రంగంలో లక్ష మందికి పైగా ఉపాధి కల్పించాం. అయినా రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ.. భారాస, భాజపా మాపై దుష్ప్రచారం చేస్తున్నాయి" అని అన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించి.. సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో



తెలంగాణ మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ బి.జనక్ ప్రసాద్, ఐటీ, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్‌కుమార్, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు సమీవుద్దీన్, రాజీవ్ వెంకటరమణ, రాంచంద్రారావు, శేఖర్‌రెడ్డి, జయదేవ్, రాజీవ్, సుజాత, రమాదేవి, సుధీర్‌రెడ్డి, సునీల్, గౌతమ్, అరుణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# రాజ్‌నాథ్ లేదా నడ్డా!

## కొత్త ఉపరాష్ట్రపతిగా వీరిలో ఒకరికి చాన్స్.. బీజేపీ వర్గాల్లో చర్చ

న్యూఢిల్లీ, జూలై 23 భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఆ పదవిలో మరో నేతను ఎన్నుకునేందుకు బీజేపీ అగ్రనేతలు సన్నాహాలు ప్రారంభించారు. ఆ పార్టీ వర్గాల అంచనా ప్రకారం కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ లేదా ప్రస్తుత బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

భారత శక్తి®

# ఇక డాలర్ టైమ్ అయిపోయిందా

బ్రిక్స్ దేశాలపై సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరించారు. ఈ కూటమి కూడా తొందర్లోనే అంతమవుతుందని ట్రంప్ అన్నారు.బ్రిక్స్ దేశాలు అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాయని, అందుకే తాను ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ట్రంప్ శుక్రవారం వైట్‌హౌస్‌లో తెలిపారు.అయితే, ఈ సందర్భంగా ట్రంప్ ఏ దేశం పేరును ప్రత్యేకంగా ప్రస్తావించలేదుబ్రిక్స్ కూటమిలో కీలక దేశాలైన భారత్, రష్యా, చైనా తమ మధ్య త్రైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ట్రంప్ ఈ హెచ్చరికలు జారీ చేశారు.అంతకుముందు కూడా బ్రిక్స్ దేశాలపై సుంకాలు విధిస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు చేశారు.భారత్, చైనా మధ్య సంబంధాలను తిరిగి గాడిలో పెట్టేందుకు రష్యా ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం చైనా దీనికి సానుకూలంగా స్పందిస్తోంది.చైనా, రష్యా, భారత్ మధ్య త్రైపాక్షిక సంబంధాలు కేవలం మూడు దేశాలకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా.. ఈ ప్రాంతంలో, ప్రపంచంలో శాంతిని, భద్రతను, స్థిరత్వాన్ని, అభివృద్ధిని అందించేందుకు సాయం చేస్తుందని చైనా విదేశీ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ చెప్పారు.త్రైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవడానికి రష్యా, భారత్‌లతో చర్చలు జరిపేందుకు చైనా సిద్ధంగా ఉందని లిన్ అన్నారు.రష్యా–భారత్–చైనా (ఆర్ఐసీ) ఫార్మాట్‌ను తిరిగి ప్రారంభించేందుకు భారత్, చైనాతో రష్యా చర్చలు జరుపుతోందని అంతకుముందు ఆ దేశ డిప్యూటీ ఫారిన్ మినిస్టర్ ఆండ్రీ రుడెంకో చెప్పారు.బ్రిక్స్ విషయం ప్రస్తావించిన ట్రంప్.. " బ్రిక్స్ అని పిలిచే ఒక చిన్న గ్రూప్ త్వరలోనే అంతం కాబోతుంది. డాలర్‌ను, డాలర్ ఆధిపత్యాన్ని, ప్రమాణాలను ఇది చేజిక్కించుకునేందుకు చూసింది" అన్నారు."బ్రిక్స్ గ్రూప్‌లోని అన్ని దేశాలపై మేం 10 శాతం సుంకాలను విధించనున్నామని చెప్పాను. ఆ తర్వాత రోజే వారు సమావేశం నిర్వహించారు. కానీ, ఎవరూ హాజరుకాలేదు" అని ట్రంప్ వెటకారంగా అన్నారు.ఆ తర్వాత ట్రంప్ మరోసారి డాలర్‌ను బలోపేతం చేయాలని, ప్రపంచ కరెన్సీగా దాన్ని ఉంచాలని నొక్కి చెప్పారు."మేం డాలర్‌ను పడిపోనీయం. ప్రపంచ కరెన్సీగా డాలర్ తన హోదాను కోల్పోతే, అది ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన మాదిరే అవుతుంది" అని తెలిపారు.'బ్రిక్స్ దేశాల కూటమి గురించి విన్నప్పుడు, నేను వారిపై కఠిన వైఖరిని అనుసరించాను. ఒకవేళ ఈ దేశాలు ఏకమైతే, త్వరలోనే ఈ గ్రూప్ అంతమవుతుంది" అని అన్నారు.ఈ ఏడాది జులై 6, 7 తేదీల్లో బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో బ్రిక్స్ 17వ సదస్సు జరిగింది. ఈ సదస్సు తర్వాత కూడా అదనంగా 10 శాతం సుంకాలను విధిస్తానని ట్రంప్ హెచ్చరించారు.'బ్రిక్స్‌కు చెందిన ఏ దేశమైనా అమెరికా వ్యతిరేక విధానాలతో ఉంటే అదనంగా 10 శాతం సుంకాలను ఎదుర్కోవాలి. ఈ సుంకాల విధింపులో ఎలాంటి మినహాయింపు ఇవ్వం" అని జులై 7న ఒక సోషల్ మీడియా పోస్టులో ట్రంప్ రాశారు.ప్రపంచ పాలనను మెరుగుపర్చడం', 'అంతర్జాతీయ సుస్థిరత'పై బ్రిక్స్ రియో డిక్లరేషన్‌లో చర్చించారు. దీంతో పాటు ఏకపక్ష సుంకాలు, సుంకాలు లేకపోవడంపైనా చర్చ జరిగింది.ఈ డిక్లరేషన్ మేనిఫెస్టోలో అమెరికా పేరును ప్రస్తావించలేదు.వాణిజ్య విధానాలను వక్రీకరించి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలను ఉల్లంఘించే ఏకపక్ష సుంకాలు, నాన్–టారిఫ్ చర్యల వినియోగంపై బ్రిక్స్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయని రియో డిక్లరేషన్ పేర్కొంది.ఏకపక్ష బలవంతపు చర్యలు విధించడం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడం కిందకే వస్తుందని ఈ డిక్లరేషన్‌లో బ్రిక్స్ దేశాలు పేర్కొన్నాయి.ఏకపక్ష ఆర్థిక ఆంక్షలు వంటివి ప్రపంచంపై ప్రతికూల ప్రభావాలను చూపిస్తాయని తెలిపాయి.ఈ బ్రిక్స్ సదస్సులో డబ్ల్యూటీఓ నిబంధనలకు అనుగుణంగా వాణిజ్యాన్ని సమర్థిస్తూ, బహుళ పక్ష వాణిజ్య విధానం గురించి చర్చించినట్లు తెలిపింది.2020లో భారత్, చైనా దేశాలకు చెందిన సైనికుల మధ్య ఘర్షణ నెలకొనడంతో, ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఆ తర్వాత ఆర్ఐసీ కోసం ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు.ఆర్ఐసీ ఫార్మాట్‌ను తిరిగి ప్రారంభించడాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోందని జులై 17న భారత మీడియాలో కథనాలు వచ్చాయి. మూడు దేశాలకు అనువైన విధానంలోనే ఏదైనా నిర్ణయం తీసుకుంటారని ఆ కథనాలు పేర్కొన్నాయి.షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ)లో పాల్గొనేందుకు ఐదేళ్లలో తొలిసారి భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చైనాకు వెళ్లిన సందర్భంగా.. ఆర్ఐసీ ఫార్మాట్‌పై చర్చలు జరిగాయి.ఏకపక్షం, రక్షణవాదం, అధికార రాజకీయం, బెదిరింపులు ప్రపంచానికి తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి" అని జులై 14న జైశంకర్‌తో భేటీ అయిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ లీ చెప్పారు.అందుకే, రెండు దేశాలు సామరస్యంగా జీవించేందుకు, ఒకదానికొకటి సాయపడుతూ విజయం సాధించే మార్గాలను అన్వేషించాలని అన్నారు.రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే అతిపెద్ద దేశాలు భారత్, చైనాలు.ఈ రెండు దేశాలు అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ విధించే అదనపు సుంకాల ముప్పు ముంగిట ఉన్నాయి. సుంకాలు విధిస్తామని 50 రోజుల్లో యుక్రెయిన్‌తో యుద్ధం ముగించేలా ఒప్పందానికి రావడానికి రష్యాపై ఒత్తిడి తీసుకు రానుంది అమెరికా.ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్–అమెరికా మధ్య సంబంధాలు క్షీణించాయని చైనా నిపుణులు అంటున్నారు.చైనీస్ న్యూస్ అవుట్‌లెట్ గ్వాంచాలో జులై 13న రాసిన కథనంలో.. అమెరికా, భారత్ మధ్య కొనసాగుతోన్న వాణిజ్య సంక్షోభాన్ని ఫుడాన్ యూనివర్సిటీకి చెందిన ఝి చావో ప్రస్తావించారు.భారత్‌ను కట్టడి చేసేందుకు పాకిస్తాన్‌ను వాడుకోవడం, రెండు దేశాల మధ్య బలవంతంగా సయోధ్యను కుదర్చడం వంటి వ్యూహాన్ని అమెరికా అవలంభించిందని ఆయన అన్నారు.చైనాకు చెందిన ఇంటర్నేషనల్ స్కాలర్ ప్రొఫెసర్ జిన్ కాన్‌రాంగ్ కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.భారత్–అమెరికా మధ్య సంబంధాలు క్షీణిస్తుండటంతో.. అమెరికా, పాకిస్తాన్ మధ్య సంబంధాలు ఇటీవల మరింత మెరుగుపడ్డాయని తెలిపారు.జూన్‌లో కెనడాలో జరిగిన జీ–7 సదస్సుకు హాజరయ్యేందుకు వెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కలవలేకపోయారని ప్రొఫెసర్ జిన్ అన్నారు.ఆ తర్వాత పాకిస్తానీ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ జనరల్ ఆసిమ్ మునీర్‌కు ట్రంప్ వైట్‌హౌస్‌లో ఆతిథ్యం ఇచ్చిన తర్వాత భారత్ మరింత అసంతృప్తి వ్యక్తం చేసింది.చైనా, రష్యాతో అమెరికా సంబంధాలు ఉద్రిక్తతంగా మారాయి. యుక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తర్వాత చైనా, రష్యాలు మరింత దగ్గరయ్యాయి.అమెరికా ఆధిపత్యంలోని ప్రపంచాన్ని తిరస్కరించి, బహుళ ధ్రువ ప్రపంచాన్ని అంటే పలు దేశాల మధ్య అధికారాన్ని పంపిణీ చేసే వ్యవస్థను సృష్టించాలని ఈ రెండు దేశాలు చర్చిస్తున్నాయి.అందుకే ప్రపంచంలో అమెరికా కరెన్సీ డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేసేందుకు రెండు దేశాలు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాయి.అమెరికా డాలర్‌తో కాకుండా చైనా కరెన్సీ యువాన్‌తో ఆసియా, ఆఫ్రికా, దక్షిణా అమెరికా దేశాలతో వాణిజ్యం చేయాలనుకుంటున్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2023లో చెప్పారు.చైనా ఇప్పటికే రష్యాతో తన కరెన్సీ యువాన్‌తో ట్రేడ్ చేస్తోంది.

# ఇక ఫుల్ టైమ్ పొలిటిక్స్...

విజయవాడ, జూలై 23, (

జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినిమాలకు గుడ్ బై చెప్పే ఆలోచనలో ఉన్నారు. ఆయన ఇక రాజకీయాల్లో పూర్తి కాలం కొనసాగేందుకే నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అందుకే నిన్న హరిహరవీరమల్లు ప్రీ రిలీజ్ ఫంక్షన్ లో గాని, మీడియా సమావేశంలో కాని ఇకపై తాను సినిమాలు చేయకపోవచ్చని చెప్పారు. పవన్ ఫ్యాన్స్ కు నిజంగా నిరాశ పర్చే వార్తే. ఎందుకంటే అతి తక్కువ సినిమాలు చేసి ఎక్కువ అభిమానులను సంపాదించుకున్న పవన్ కల్యాణ్ కు నిజజీవితంలో సినిమాలపై ఆసక్తి లేదు. ఆయన ఎక్కువ కాలం ప్రజాసేవ చేయాలని నిర్ణయించుకుని జనసేన పార్టీ 2014లో ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల్లో దారుణ ఓటమికి గురి కావడంతో ఆయన మనసును మళ్లించుకోవడానికి కొంత కాలం సినిమాల వైపు మళ్లించారు. 2019 ఎన్నికల ఫలితాల వెంటనే... 2019 ఎన్నికలు జరిగిన తర్వాత వెనువెంటనే రాజకీయాల్లో తన పరిస్థితి ఏంటో పవన్ కల్యాణ్ తాను తెలుసుకున్నారు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడులోనూ కమల్ హాసన్ వంటి స్టార్లు రాజకీయాల్లో రాణించలేకపోవడం, రాజకీయాల్లోకి వచ్చేందుకు అన్నీ సిద్ధం చేసుకుని వెనక్కు తగ్గిన రజనీకాంత్ ను చూసిన తర్వాత పవన్ కల్యాణ్ ఆలోచనల్లో మార్పు వచ్చిందని చెబుతున్నారు. తాను కీలక పదవిలో లేకపోయినా ఏపీ రాజకీయాల్లో ముఖ్య భూమిక పోషించాలన్న భావనతో ఆయన 2019 ఎన్నికల తర్వాత ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో జత కట్టారు. అయితే ఏపీలో బీజేపీకి పెద్దగా ఓటు బ్యాంకు లేకపోవడంతో ఆయన టీడీపీతో సన్నిహితంగా మెలగాలని కోరుకున్నారు. జగన్ ను ఓడించాలంటే కేంద్రంలో అధికారంలో ఉన్నా పార్టీ మద్దతు అవసరం. ఓటు బ్యాంకు లేకపోయినా ఎలక్షనీరింగ్ చేయాలంటే బీజేపీ సహకారం అవసరమవుతుందని గ్రహించారు. ఇక టీడీపీ విషయానికి వస్తే క్షేత్రస్థాయిలో బలంగా ఉన్న పార్టీ, ఓటు బ్యాంకు భారీగా కలిగిన పార్టీగా, యాభై వసంతాల చరిత్ర కలిగిన పార్టీగా దానిని కూడా కూటమిలో కలుపుకుంటే జగన్ ను కొట్టేయవచ్చన్న నమ్మకంతోనే కూటమిని ఏర్పాటు చేసి సక్సెస్ అయ్యారు. ఇక రానున్న కాలంలోనూ కూటమికి తిరుగులేదని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. తాను ముఖ్యమంత్రిగా కాకపోయినా సరే.. చంద్రబాబు నేతృత్వంలో ఏర్పాటయ్యే ప్రభుత్వంలో కీలకంగా మారాలన్నది మాత్రం పవన్ ఆలోచనగా ఉంది. అందుకే పవన్ కల్యాణ్ కూటమిని సజావుగా వచ్చే ఎన్నికల వరకూ మనస్పర్థలు తలెత్తకుండా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక సినిమాలకు స్వస్తి చెప్పి ఫుల్ టైం రాజకీయాల్లోనే ఉంటారట.

మళ్లీ చేయాలంటున్న ఫ్యాన్స్

వర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన లేటెస్ట్ చిత్రం 'హరి హర వీరమల్లు' ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ దాదాపుగా అన్ని ప్రాంతాల్లో మొదలయ్యాయి. ప్రీమియర్ షోస్ బుకింగ్స్ కూడా ఒక్క నైజాం ప్రాంతం లో తప్ప అన్ని ప్రాంతాల్లో బుకింగ్స్ ని మొదలు పెడుతున్నారు. మూడేళ్ళ తర్వాత పవన్ కళ్యాణ్ నుండి వస్తున్న చిత్రం, అది కూడా డైరెక్ట్ సినిమా, అభిమానులతో పాటు ప్రేక్షకులు కూడా ఆయన్ని వెండితెర పై చూడాలని ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అయితే ఎన్నడూ లేని విధంగా పవన్ కళ్యాణ్ ఈ సినిమా ప్రొమోషన్స్ లో చాలా చురుగ్గా పాల్గొంటున్నాడు. ఈరోజు మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు నాన్ స్టాప్ గా అన్ని నేషనల్ మీడియా చానెల్స్ కి ఆయన ఇంటర్వ్యూస్ ఇచ్చాడు.లోకల్ గా ఉండే ఒక పాపులర్ న్యూస్ ఛానల్ కి ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూ లో అభిమానులకు నచ్చని కొన్ని కామెంట్స్ చేశాడు. అదేంటో ఒకసారి చూద్దాం. ఆయన మాట్లాడుతూ 'ప్రస్తుతానికి అయితే చేతిలో ఉన్న ఈ మూడు సినిమాలను పూర్తి చేసేసాను. ఉస్తాద్ భగత్ సింగ్ మరో ఆరు రోజులు షూటింగ్ చేస్తే అయిపోతుంది. ఓజీ చిత్రం ఇప్పటికే పూర్తి అయ్యింది. ఆ తర్వాత పూర్తిగా రాజకీయాలను నా సమయం కేటాయించాలని అనుకుంటున్నాను. పార్టీ ని క్షేత్ర స్థాయి నుండి బలోపేతం చెయ్యాలి. అదే నా ప్రధాన లక్ష్యం. అయితే సినిమా నా జీవనాధారం. ప్రస్తుతానికి నా వద్ద కథలు ఏమి లేవు. భవిష్యత్తులో నా రాజకీయ కార్యక్రమాలకు క్లాష్ రాకుండా ఉండే పని అయితే సినిమాల్లో నటిస్తాను. లేదంటే నా పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ ని రీ యాక్టీవ్ చేసి సినిమాలను నిర్మిస్తాను' అంటూ చెప్పుకొచ్చాడు పవన్ కళ్యాణ్.

ఆయన మాట్లాడిన ఈ మాటలు అభిమానులను తీవ్రంగా నిరాశకు గురి చేస్తున్నాయి. సమయం తీసుకొని అయినా సినిమా చెయ్యండి అన్నా అంటూ అభిమానులు బ్రతిమిలాడుతున్నారు. కానీ అభిమానులు అర్థం చేసుకోవాల్సినది ఒకటి ఉంది. ఆయన సినిమాలకు దూరం అవుతానని చెప్తాడు కానీ, డబ్బు అవసరం ఆయన్ని సినిమాలు కచ్చితంగా చేయిస్తుంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వెంటనే ఆయన సినిమాలు చెయ్యకపోవచ్చు గాక, కానీ 2027 లేదా 2028 లో ఆయన కచ్చితంగా సినిమా చేయొచ్చు. అభిమానులు అధైర్యపడొద్దు అంటూ సోషల్ మీడియా లో పలువురు విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ రెడీ అంటే సురేందర్ రెడ్డి ప్రాజెక్ట్ సిద్ధంగా ఉంది. మరి దీన్ని ఆయన ఎప్పుడు సెట్స్ మీదకు తీసుకెళ్తాడో చూడాలి.

# నాగబాబు మంత్రిపదవి.. ఇంకా టైముంది....

విజయవాడ, జూలై 23,

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబుకు మంత్రి పదవిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన పవన్ కళ్యాణ్.. నాగబాబు మంత్రి పదవిపై క్లారిటీ ఇచ్చారు. నాగబాబుకు మంత్రి పదవి ఇస్తారంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఆయనకు ఎమ్మెల్సీ పదవి కూడా ఇచ్చిన సంగతి తెలిసిందేజనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబుకు మంత్రి పదవి అంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో, మెయిన్ స్ట్రీమ్ మీడియాలో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్లారిటీ ఇచ్చారు. ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నాగబాబుకు మంత్రి పదవి వార్తలు వస్తూనే ఉన్నాయి. ఎన్నికల సమయంలో అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాలని నాగబాబు భావించారు. అయితే కూటమి పొత్తుల లెక్కల్లో ఆ స్థానం బీజేపీకి వెళ్లగా.. సీఎం రమేష్ అనకాపల్లి ఎంపీగా గెలుపొందారు. అయితే పోటీ చేసే అవకాశం దక్కకపోయినప్పటికీ.. జనసేన అభ్యర్థుల తరుపున, పిఠాపురంలో పవన్ కళ్యాణ్ విజయానికి నాగబాబు కృషి చేశారు.ఇక ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుపొంది అధికారంలోకి రావటంతో నాగబాబుకు నామినేటెడ్ పోస్టులు ఇస్తారంటూ వార్తలు వచ్చాయి. టీటీడీ ఛైర్మన్ చేస్తారని ఒకసారి.. మంత్రి పదవి ఇస్తారని మరోసారి ఇలా రకరకాల కథనాలు వచ్చాయి. చివరకు ఈ కథనాలకు చెక్ పెడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకుంటామంటూ టీడీపీ ప్రకటన కూడా ఇచ్చింది. 2024 డిసెంబర్ నెలలో ఏపీ నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్డీఏ కూటమి అభ్యర్థులను ప్రకటించిన సందర్భంలో..



నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు టీడీపీ ప్రకటన విడుదల చేసింది. వాస్తవానికి నాగబాబును రాజ్యసభకు పంపుతారని వార్తలు రాగా.. బీజేపీ నుంచి ఆర్. క్రిష్ణయ్య, టీడీపీ నుంచి బీద మస్తాన్‌రావు, సానా సతీష్‌లను రాజ్యసభకు పంపారు. దీంతో నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకుంటామని టీడీపీ ప్రకటించింది.అయితే ఈ ప్రకటన వచ్చి సుమారు ఏడు నెలలు గడుస్తున్నా నాగబాబుకు మంత్రి పదవి మాత్రం దక్కలేదు. అయితే ఈలోపే నాగబాబును ఎమ్మెల్సీని చేశారు. దీంతో మంత్రివర్గంలోకి మార్గాన్ని సుగమం చేసింది కూటమి. అయితే ఎప్పుడు నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకుంటారనే దానిపై తాజాగా పవన్ కళ్యాణ్ క్లారిటీ ఇచ్చారు.ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాగబాబుకు మంత్రి పదవిపై పవన్ కళ్యాణ్ పెదవి విప్పారు. నాగబాబుకు మంత్రి పదవిపై ఇప్పటిదాకా చర్చ జరగలేదన్న పవన్ కళ్యాణ్.. ఈ అంశం గురించి సీఎం చంద్రబాబు ఇప్పటికే తన నిర్ణయం వెల్లడించారని అన్నారు. అయితే ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది తానేనని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. రాజకీయాల్లో కొన్నిసార్లు ఇబ్బందులు తప్పవన్న జనసేనాని.. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టినట్లు చెప్పుకొచ్చారు.

# తోతాపురి మామిడి రైతులకు బిగ్ రిలీఫ్

తిరుపతి, జూలై 22

ఆంధ్రప్రదేశ్‌లోని మామిడి రైతులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. తోతాపురి మామిడికి క్వింటాకు రూ.1,490 మార్కెట్ ధరను నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో ఈ ధరను చెల్లిస్తాయి. ఈ డబ్బు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుంది. కేంద్రం నిర్ణయం పట్ల రైతులు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో వ్యాపారులు, ప్రాసెసింగ్ యూనిట్లు కూడా రైతులకు అండగా నిలిచాయి.ఆంధ్రప్రదేశ్‌లో మామిడి రైతులకు ఊరట దక్కింది. తోతాపురి మామిడికి క్వింటాకు మార్కెట్ ఇంటర్వెన్షన్ ధరను రూ.1,490గా నిర్ణయించారు. ఈ మేరకు కేంద్రం నుంచి ప్రకటన విడుదల చేశారు. కేంద్రం, ఏపీ ప్రభుత్వం 50:50 నిష్పత్తిలో మార్కెట్ ఇంటర్వెన్షన్ ధరను చెల్లిస్తాయి. ఈ డబ్బుల్ని నేరుగా రైతుల బ్యాంకు అకౌంట్‌లలో జమ చేస్తారు. ఇంటర్వెన్షన్ ధర విషయంపై స్పందించి.. ఆ సమస్యను పరిష్కరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు రైతులు ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం 2025–26 సంవత్సరానికి ఓమో కింద 1.62 లక్షల మెట్రిక్ టన్నుల మామిడిని కొనుగోలు చేయడానికి అవకాశం కలుగుతుంది.కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నిర్ణయంతో మామిడి ధరల పడిపోకుండా.. రైతులకు మేలు కలిగింది అంటున్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవనోపాధిని మెరుగుపరుస్తుంది అన్నారు. రైతుల జీవితాల్లో ఇది వెలుగులు నింపుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం



ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు చేస్తున్న కృషిని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అభినందించారు.మరోవైపు మామిడి రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారు. ఆయన చొరవతో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని తోతాపురి మామిడి రైతులకు మద్దతుగా వ్యాపారులు ముందుకు వచ్చారు. అలాగే, చాలా ప్రాసెసింగ్ యూనిట్లు కూడా రైతులకు సహాయం చేయడానికి ముందుకు వచ్చాయి. తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయంతో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. అంతేకాదు ఏపీ ప్రభుత్వం గత వారం కూడా మామిడి రైతుల అకౌంట్‌లలో రూ.260 కోట్లు బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేయనుంది. అలాగే తాజాగా మరో రూ.150 కోట్లు వారి ఖాతాలకు జమ చేయబోతోంది. మొత్తం మీద ఏపీ ప్రభుత్వం తోతాపురి మామిడి రైతుల్ని ఆదుకునే పనిలో ఉంది.

# గుండ్లవాగు, జలగలంచ వాగుల వరద ఉధృతిని పరిశీలించిన మంత్రి సీతక్క


ములుగు

:ములుగు జిల్లా లోని పసర తాడ్వాయి మధ్యలో ఉన్న జలగలంచ గుండ్ల వాగు వరద ఉధృతిని బుధవారం పరిశీలించిన రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క రాష్ట్ర వ్యాప్తంగా అదే విధంగా ములుగు జిల్లాలో భారీ వర్షాలు నిన్నటి నుండి కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మంత్రి సీతక్క ప్రజలకు సూచించారు.జిల్లా అధికార యంత్రాంగం భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని, జిల్లా ప్రజలకు అందుబాటులో ములుగు కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలకు ఏమైనా సందేహాలుంటే కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ 18004257109 కు కాల్ చేయాలని మంత్రి సీతక్క ప్రజలను కోరారు.రైతులు ముఖ్యంగా విద్యుత్తు షాక్ ప్రమాదాల గురి కాకుండా జాగ్రతగా ఉండాలని వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయని, జాలరులు చేపల వేటకు వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదే విధంగా గ్రామాలలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను అధికారులు గుర్తించి వారిని సురక్షిత ప్రాంతానికి తరలించే విధంగా జిల్లా కలెక్టర్,ఎస్పీ, కింది స్థాయి అధికారులతో మానేటరింగ్ చేయాలని సూచించారు.మంత్రి సీతక్క వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో దంచి కొడుతున్న వానలు

## - మల్లూర్ లో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

ములుగు ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు గ్రామంలోని అత్త చెరువు తూము లీకేజీతో చెరువులోకి వచ్చిన వరద నీరు సమీపంలోని బెస్తవాడ( మైసమ్మ సెంటర్) లోని ఇళ్లలోకి చేరాయి. సోమవారం రాత్రి నుండి మండలంల కురుస్తున్న భారీ వర్షానికి చెరువులోకి చేరిన వరద నీరంతా



తూము లీకేజీ నుండి ఇళ్లలోకి చేరడంతో చెరువు సమీపంలోని బెస్తవాడ కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. చెరువు తూము లీకేజీ విషయం ఎండాకాలంలో సంబంధిత ఐబీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, దాని ఫలితంగానే చెరవులోకి చేరిన వరదనీరు తమ ఇళ్లను ముంచేసిందని బాదితులు ఆరోపిస్తున్నారు.వాడలోని ప్రతి ఇంటిలోకి నడుములోతు చేరిన వరద నీటితో ఇళ్లు మొత్తం మునిగిపోయిన పరిస్థితి నెలకొనడంతో ఆయా కుటుంబాలలోని వృద్ధులు, చంటి పిల్లలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం ఇలాగే కొనసాగితే చెరువు కట్ట తెగి తాము నిరాశ్రయులమవుతామని ఆయా కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత రెవెన్యూ, పోలీస్, ఐబీ అధికారులు స్పందించి వెంటనే తూము లీకేజీకి మరమ్మత్తులు చేసి ముంపుకు గురైన కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

# భారీ వర్షాలతో నిండిన ఆశ్రమ పాఠశాల బాలికల తరలింపు

భద్రాద్రి కొత్తగూడెం మణుగూరులో సుమారు నాలుగు గంటల పాటు భారీ వర్షం కురిసింది. మణుగూరు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలోకి వర్షపు నీరు భారీగా చేరింది. దాంతో అధికారులు బాలికలను ప్రభుత్వ కళాశాలలోకి హుటా హుటిన తరలించారు.

27కృష్ణకాంత్ పార్క్ లో జీహెచ్ఎంసీ కార్మికులు ,ఉద్యోగులు ,పొదుపు సంఘాల సభ్యులకు ప్రత్యేక వైద్య శిబిరం

ప్రారంభించిన జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

వైద్య శిబిరం లో ఆరోగ్య పరీక్షలు చేసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్..

వైద్య పరీక్షల కోసం భారీగా హాజరైన జీహెచ్ఎంసీ కార్మికులు..

జీహెచ్ ఎంసీ కార్మికులకు హెల్త్ కిట్స్ పంపిణీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్

జుబ్లీ హిల్స్ లోని కృష్ణకాంత్ పార్క్ లో జీహెచ్ఎంసీ కార్మికులు ,ఉద్యోగులు ,పొదుపు సంఘాల సభ్యులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంబించారు. అక్కడ అయన ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు.

వైద్య పరీక్షల కోసం జీహెచ్ఎంసీ కార్మికులు భారీగా హాజరైయారు.

జీహెచ్ ఎంసీ కార్మికులకు హెల్త్ కిట్స్ మంత్రి పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, కలెక్టర్ దాసరి హరిచందన, కార్పొరేటర్లు , అజారుద్దీన్, నవీన్ యాదవ్ తదితర ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జీహెచ్ ఎంసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని అన్ని ప్రాంతాల్లో హెల్త్ క్యాంప్ లో ఏర్పాటు చేయడం జరుగుతుంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దవాఖాన కు పోకుండా ఏ పరీక్షలైన ఇక్కడే తీసేలా అవసరమైన చికిత్స ఆసుపత్రికి పంపించేలా ఇక్కడ క్యాంప్ లు ఏర్పాటు చేయడం జరిగింది. హైదరాబాద్ రాష్ట్ర రాజధాని ఇక్కడ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ఆరోగ్యంగా ఉండడానికి జిల్లా రెవెన్యూ , మున్సిపల్ ,మెడికల్ సిబ్బంది కలిసి మెడికల్ క్యాంప్ ఎర్పాటు చేయడం జరుగుతుంది. అందరూ ఇక్కడ వైద్య పరీక్షలు చేసుకోండి ఉచిత మందులు ఇస్తారు. 169 బస్తీ దవాఖాన లు,91 ప్రైమరీ హెల్త్ సెంటర్లు ,11 స్పెషాలిటీ ఆసుపత్రులు ఇక్కడ ఉన్నాయి..30 ఏరియాల్లో ఈ హెల్త్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుంది. అందరూ ఆరోగ్యంగా ఉంటేనే మనం ఏ పని అయినా చేసుకుంటాం. ఆరోగ్యంగా ఉండడానికి అవసరమైన వైద్య పరీక్షలు ప్రభుత్వమే చేస్తుందని అన్నారు.

నిన్నటి వరకు బోనాల పండుగ అయింది..సీజనల్ మారుతుంది... వాతావరణ మార్పు వల్ల జబ్బులు వచ్చే అవకాశం ఉంది. మీ ఆరోగ్యాలు కాపాడడానికి మీ ఏరియకు వైద్య బృందాలు వస్తున్నాయి. పేదలకు అండగా ఉండాలని ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం. పేద ప్రజలు కూడా సన్న బియ్యం తినాలని పంపిణీ చేస్తున్నాం. 10 సంవత్సరాల తర్వాత రేషన్ కార్డులు ఇస్తున్నాం. 53 వేల రేషన్ కార్డులు హైదరాబాద్ లో పంపిణీ కి సిద్ధంగా ఉన్నాయి. 2 లక్షల 31 వేల కొత్త యూనిట్లు వస్తున్నాయి. మీ ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వం రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్లు అన్ని కార్యక్రమాలు చేస్తున్నాం. ఆర్టీసీ లో మహిళలు 200 కోట్ల ఉచిత టికెట్లు మైలురాయి దాటుతుంది.. మహిళలకు శుభాకాంక్షలని అన్నారు.

గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందించడానికి మెస్ చార్జీలు పెంచాం. ఈ ప్రభుత్వం మీది ఆశీర్వదించండి..ప్రజా పాలన ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుంది. చదువుకున్న వారికి 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. హైదరాబాద్ లో ఉన్న ప్రతి వ్యక్తి హెల్త్ క్యాంప్ వినియోగించుకోవాలని అన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి

ములుగు

ములుగు జిల్లాలో భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలి వెళ్లాలని బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి గారు విజ్ఞప్తి చేశారు.బంగాళాఖాతంలో అల్పపీడన ధోరణి వల్ల జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో తప్ప ఇంటి నుంచి బయటకు వెళ్ళకూడదని,లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. వాతావరణ శాఖ సూచన మేరకు మృత్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని ఆమె తెలిపారు.భారీ శబ్దాలతో ఉరుములు కళ్లు మిరుమిట్లు గొలిపే మెరుపులు వస్తున్నాయంటే పిడుగులు పడతాయని గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ఈ పిడుగుపాటుకు పశువులు, ప్రజలు మరణిస్తున్నారని, ముఖ్యంగా వ్యవసాయ క్షేత్రాల్లో, చెట్లకింద ఉన్నవారే ఈ పిడుగుపాటుకు గురవుతున్నారని ఆమె అన్నారు. ఉరుములు, మెరుపులు వస్తున్నప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లక పోవడమే ఉత్తమమని తెలిపారు.లోతట్టు మండలాలైన కన్నాయిగూడెం, ఏటూరునాగారం మంగపేట, తాడ్వాయి, ప్రాంత ప్రజల అప్రమత్తంగా ఉండాలని కోరారు

# బీజేపీకి జగన్ జై కొడతారా...

విజయవాడ, జూలై 23



వైసీపీ అధినేత జగన్ విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కొంత సానుకూలతతోనే ఉన్నట్లు తెలుగుదేశం పార్టీ నేతలు అనుమానిస్తున్నారు. వైఎస్ గన్ ఢిల్లీకి వెళ్లకపోయినా ఆయన ఇక్కడి నుంచి పార్టీ అగ్రనేతలతో టచ్ లో ఉన్నారన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ కూడా సాఫ్ట్ కార్నర్ గానే వ్యవహరిస్తున్నారని, అదే సమయంలో బీజేపీ పై జగన్ పార్టీ పెద్దగా విమర్శలు చేయకపోవడాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. గతంలో తాము వ్యతిరేకించినప్పుడు ఏపీలో పర్యటించినప్పుడల్లా చంద్రబాబుపైనా, తెలుగుదేశం పాలనపైన విమర్శలు చేసే ప్రధాని నరేంద్ర మోదీ నయితం ఈసారి జగన్ విషయాన్ని ప్రస్తావించకపోవడాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో మిత్రపక్షంగా ఉన్న తమను కాదని, జగన్ ను కూడా చంకన పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్న అనుమానం వారిలో బలపడుతుంది.... ఇటీవల వరసగా రెండు సార్లు ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ పర్యటనకు వచ్చారు. అమరావతి రాజధాని రీలాంచింగ్ పనులకు శంకుస్థాపన చేయడానికి వచ్చినప్పుడు జగన్ ప్రస్తావన లేకుండా తన ప్రసంగంలో జాగ్రత్త పడ్డారనిపిస్తుంది. అదే సమయంలో చంద్రబాబు నాయుడును, పవన్ కల్యాణ్, లోకేశ్ లను పొడిగినప్పటికీ జగన్ ను విమర్శించకపోవడాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అలాగే విశాఖకు కూడా కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత రెండుసార్లు ప్రధాని మోదీ వచ్చినప్పటికీ బహిరంగ సభలో జగన్ ప్రస్తావన తేవకపోవడాన్ని తప్పుపడుతున్నారు. గత ప్రభుత్వం వైఫల్యం కారణంగానే అని పాసింగ్ రిమార్క్ చేశారు తప్పించి జగన్ అవినీతిపై పెద్దగా మాట్లాడలేదని తెలుగుతమ్ముళ్లు కొంత అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. కేటాయించనున్నారా? ఏదో జరుగుతుందని... ఇక జగన్ కేసుల్లో కూడా ఎలాంటి పురోగతి లేకపోవడాన్ని కూడా వారు ఏదో జరుగుతుందన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. జగన్ పై 2014లో నమోదయిన అనేక కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా జరగడం లేదు. న్యాయస్థానాల్లో అనేక కేసులు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయి. వాటిపై అతీ గతీ లేదని అంటున్నారు. ఇక వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోనూ ఎలాంటి పురోగతి లేదు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి దాదాపు ఆరేళ్లు గడుస్తున్నా సీబీఐ కేసును సరిగా దర్యాప్తు చేయకపోయినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న అసంతృప్తి తెలుగుదేశం పార్టీ నేతల్లో ఉంది. ఈ కేసుల్లో అనుమానితులైన వారు బెయిల్ పై ఉండటాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు. . ఇక చిన్న విషయమూ బయటకు వచ్చినా వెంటనే స్పందించే ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు మద్యం కుంభకోణం కేసులో ముందడుగు వేయడం లేదన్న ఉక్రోశాన్ని వెళ్లగక్కుతున్నారు. తాజాగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూడా మద్యం కుంభకోణం కేసును ఈడీ సీరియస్ గా తీసుకోకపోవడాన్ని తప్పుపట్టారు. చిన్నా చితకా కేసుల్లో హడావిడి చేసే ఈడీ అధికారులు దాదాపు 3,200 కోట్ల రూపాయల కుంభకోణంపై ఎందుకు స్పందిచండం లేదని ప్రశ్నించారు. కేవలం నిందితులను విచారించి వదిలేశారన్న విమర్శలు టీడీపీ నుంచి బహిరంగంగా వినిపిస్తున్నాయి. దీంతో ఢిల్లీ స్థాయి కమలం నేతలపై అనుమాన బీజం సైకిల్ పార్టీ నేతల్లో బయలుదేరిందనుకోవాలి. ఆ అనుమానం పెరిగి పెద్దది కాకముందే బీజేపీ తగిన చర్యలకు ఉపక్రమించాలని నేతలు కోరుతున్నారు.

# చంద్రబాబు అలా మారిపోయారే...

తిరుపతి, జూలై 23,



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిజంగా గతం కంటే భిన్నంగా వ్యవహరిస్తున్నారు. గతంలోమూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో అంతా తానే అయి వ్యవహరించేవారు. ఆయన కూడా ఇతర రాజకీయ నేతల మాదిరిగానే వ్యవహరించేవారు. చంద్రబాబు పై ఒక అపవాదు కూడా ఉండేది. ఎక్కువగా అధికారులపైనే ఆధారపడి పాలన చేస్తారని. అధికారుల ఫీడ్ బ్యాక్ ప్రకారమే నడచుకుంటారనే వారు. నిజానికి అందులో నిజం లేకపోలేదు. 1995 లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు అయిన నాటి నుంచి 1999లో, 2014లో గాని అధికారులే చంద్రబాబు పాలనలో ఎక్కువగా పెత్తనం చెలాయించేవారు. ఎన్నికయిన ప్రజాప్రతినిధులు నామమాత్రంగా ఉండేవారు. ప్రజలు ఏమనుకుంటున్నారన్న ఫీడ్ బ్యాక్ ను కూడా అధికారుల నుంచి తీసుకునే వారు. అందుకే తరచూ ఆయన గతంలో కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేవారు. వారంలో ఒకరోజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ రాష్ట్రంలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే వారు. ఇటు జిల్లా కలెక్టర్లు, అటు ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు చెప్పిన మాటలనే చెవికి ఎక్కించుకునే వారు. క్షేత్రస్థాయిలో తిరిగే నేతలను పెద్దగా పట్టించుకునే వారు కారు. వారితో సమావేశమ య్యేందుకు కూడా ఇష్టపడే వారు. వారికి సమయం కూడా కేటాయించే వారు కాదు. దీంతో తమకు కావాల్సిన పనులు చేయించుకోవడానికి ముఖ్యమంత్రి కార్యాలయం పైనే ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆధారపడే వారు. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా అదే పరిస్థితి తలెత్తింది. అనేక మంది పార్టీ నుంచి వెళ్లిపోయిన ఎమ్మెల్యేలు తమను కలిసేందుకు కూడా చంద్రబాబు సమయం ఇచ్చేవారు కాదంటూ విమర్శలు చేశారు. కానీ 2024 ఎన్నికల తర్వాత చంద్రబాబు లో పెను మార్పు కనిపిస్తుంది. తరచూ ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. పార్టీ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబు వరస భేటీలు జరుపుతున్నారు. ఈరోజు నరసరావుపేట, పాతపట్నం ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశం కానున్నారు. రోజువారీ షెడ్యూల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ రోజుకు ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సమావేశమవుతున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. .. ఇప్పటివరకు పద్దెనిమిది మంది ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. పార్టీ బలోపేతం, నియోజకవర్గంలో సమస్యలు-పరిష్కారాలు, పార్టీ పదవులపై వంటి ప్రధాన అంశాలు అజెండాగా భేటీ జరగనుంది. నియోజకవర్గాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరుగుతున్న తీరు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను కూడా అడిగి తెలుసుకుంటున్నారు. అదే సమయంలో జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు ఖచ్చితంగా కార్యకర్తలతో సమావేశం అవుతున్నారు. కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వారికి అండగా నిలబడతానని భరోసా ఇస్తున్నారు. మరొకవైపు లోకేశ్ కూడా కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తుండంతో 2024 తర్వాత చంద్రబాబు పాలనలో పెనుమార్పులు జరిగినట్లు కనపడుతుంది.

# గోదావరి పుష్కరాల పనుల్లో అధికారులు

రాజమండ్రి, జూలై 23,

గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఘాట్‌లను సుందరీకరిస్తున్నారు. ప్రజలు వచ్చి పుణ్య స్నానాలు చేసి సురక్షితంగా తిరిగి వెళ్లేందుకు రహదారులను కూడా విస్తరిస్తున్నారు. అయితే అన్నింటి కంటే ముఖ్యమైన రైల్వే స్టేషన్ పునఃనిర్మాణ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.



అధునాత సౌకర్యాలు కల్పించేందుకు కేంద్రం నుంచి నిధులు మంజూరు అయినప్పటికీ వర్క్ మాత్రం టెండర్ దశ దాటి వెళ్లడం లేదు. రాజమండ్రి రైల్వే స్టేషన్‌ను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని కేంద్రం భావించింది. అందుకే అమృత్ భారత్‌స్టేషన్ పథకంలో చేర్చారు. గతంలో ప్రధానమంత్రి మోదీ వర్చువల్‌గా పనులకు శంకుస్థాపన చేశారు. అయితే భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మరికొన్ని విస్తరణ పనులు చేస్తే ప్రయోజనం ఉంటుందని స్థానిక నాయకులు చెప్పడంతో పనులను రీడిజైన్ చేశారు. దీంతో మొత్తానికి పనులు ఆగిపోయాయి. స్టేషన్ సమగ్ర అభివృద్ధికి ఇప్పటికే రైల్వే మంత్రిత్వ శాఖ 271.43 కోట్లు కేటాయించింది. ప్రధానమంత్రి శంకుస్థాపన చేయడంతో పనులు ఊపందుకుంటాయని అంతా అనుకున్నారు కానీ టెండర్లు దశ దాటి వెళ్లడం లేదు. పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయాలని ఈ మధ్య రైల్వే అధికారులను రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి కలిసి రిక్వెస్ట్ చేశారు. టెండర్లు ఖరారు చేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రస్తుతం రోజుకు 35 వేల మంది ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే గంటలకు దాదాపు పది వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. పశ్చిమ భాగంలో కొత్తగా జీ +3 బిల్డింగ్ నిర్మించాలి. తూర్పు వైపు కూడా జీ+5 భవన నిర్మించారు. ఇక్కడ ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేలా ప్లాట్‌ఫామ్‌లు నిర్మించాల్సి ఉంది. 17 ఎస్కలేటర్లు, ఏడు లిఫ్టుల నిర్మాణం జరగాల్సి ఉంది. ఫుడ్ ప్లాజాలు, ఇతర దుకాణాలకు నిర్మాణాలు చేపట్టాలి. రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జి కట్టాలి. పార్కింగ్ సౌకర్యాలు అభివృద్ధి చేయాలి. ఇలా చాలా పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటి నుంచి వీటిని ప్రారంభించకుంటే పుష్కరాల కాలం నాటికి పూర్తి కావని స్థానిక ప్రజానీకం అభిప్రాయపడుతున్నారు. అందుకే కచ్చితంగా ప్రారంభించేలా అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు

===================

# మత్తు బాబులకు పోలీసుల కౌన్సిలింగ్

తిరుపతి

జిల్లా పొటలీసులు మత్తు ఇంజక్షన్లు తీసుకుంటున్న వారిపై స్పెషల్ టీంలతో నిఘా పెట్టడం జరిగిందని తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవింద్ అన్నారు.

బైరాగిపట్టెడ సమీపంలోని లింగేశ్వర నగర్ వద్ద చెట్లు పొదలలో రహస్యంగా నలుగురు యువకులు మత్తు ఇంజక్షన్ తీసుకుంటున్న దృశ్యాలు డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించారు. యువకులను ఈగల్ టీం, డ్రోన్ టీం సిబ్బంది పట్టుకుని తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ కు అప్పగించారు.

లింగేశ్వర నగర్ లో నివాసం ఉండే యువకులుగా గుర్తించారు. యుక్తవయస్సు లో ఇలాంటి చేడు వ్యసనాలకు బానిసలుగా మారి మీ భవిష్యత్ ను మీరే పాడు చేసుకొవద్దని మత్తు ఇంజక్షన్లకు బానిసలైన యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

యువకులకు పోలీసు వారు కౌన్సిలింగ్ ఇవ్వడం తోపాటు... వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పోలీస్ స్టేషన్ కు పిలిచారు. మత్తు ఇంజక్షన్స్ తీసుకోవడం వలన జరిగే పరిణామాల గురించి తల్లిదండ్రులకు పోలీసులు వివరించారు.

అంతే కాకుండా వారిపై కేసు నమోదు చేస్తే... వారి బంగారు భవిష్యత్ మధ్య లోనే అగిపోతుందని తల్లిదండ్రులకు చెప్పారు. తల్లితండ్రుల అనుమతితో యువకులను వైద్యుల సూచనల మేరకు యువకులను రిహబిలేషన్ సెంటర్ కు పంపి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎవరైనా ఇలాంటి మత్తు పదార్థాలకు అలవాటు పెడితే తల్లిదండ్రులు భయపడకుండా పోలీసు వారి వద్దకు వస్తే రిహబిలేషన్ సెంటర్ కు పంపిస్తామని వెల్లడించారు. మరోసారి ఇలాంటి వాటికి పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొందరు యవకుల వల్లన మత్తు ఇంజక్షన్ వాడటం అలవాటు చేసుకున్నామని యువకులు అంటున్నారు. ఇలాంటి ఇంజక్షన్స్ వాడటం తప్పైయిందని మరొకసారి ఇలాంటి ఇంజక్షన్లు వాడమని యువకులు అంటున్నారు.

# బంజారా హిల్స్ లో ఆలయం ధ్వంసం

## పాత పెద్దమ్మ గుడి ప్రాంతంలో ఉద్రిక్తత

హైదరాబాద్

బంజారా హిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని పాత పెద్దమ్మతల్లి ఆలయం ధ్వంసం చేశారని ఆరోపిస్తూ స్థానికులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. గతంలో గుట్టలపై ఉన్న అమ్మవారి విగ్రహాన్ని ఇటీవలే తొలగించిన గుట్టల ప్రదేశంలోనే నూతనంగా నిర్మించిన భవన్లోకి మార్చారు. ఈ ఏడాది బోనాల కూడా ఘనంగా నిర్వహించినట్లు భక్తులు చెబుతున్నారు. కాగా మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దీని కూల్చివేసినట్లు వారు పేర్కొంటున్నారు. దీంతో ఆ ప్రాంతంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికులను శాంతింప చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించడంతో శాంతించారు.

# రామచంద్రాపురం రోడ్లు నరకానికి దారులు

ఎన్టీఆర్

ఏ కొండూరు మండలం రామచంద్రపురం అంటేనే ప్రజలు వామ్మో అంటున్నారు. వర్షానికి రోడ్డుపై ఉన్న మోకాలి లోతు గోతుల్లో మురుగునీరు నిలిచింది. దాంతో వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు అధ్వానం కారణంగా వాహనాలు షెడ్డుకు చేరుతున్నాయి. భారీ వాహనాలు సైతం గోతుల్లో దిగబడటంతో రిపేర్లకు గురైన సంఘటనలు కోకొల్లలు. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని అధికారులు అంటున్నారు. హాస్పిటల్ పనిమీద విజయవాడ వెళ్లొచ్చే పేషెంట్స్, గర్భిణీ స్త్రీలు తీవ్ర భయాందోళనకు గురైతున్న పరిస్థితి వుంది. కిలోమీటర్ రోడ్డు దాటాలంటేనే కనీసం 15 నిమిషాలు సమయం పడుతుంది. ఇక టోల్ ఫీజ్ కట్టనిదే టోల్ ప్లాజా సిబ్బంది కదలనివ్వరు. కనీసం మరమ్మతులు చేపట్టడం లేదని స్థానికుల ఆరో?పణ. టోల్ ఫీజ్ కట్టించుకుంటే సరిపోదనీ రోడ్లు నిర్మించాలని సిబ్బందికి ఎదురుతిరుగుతున్నారు.

# దామోదర్ హత్య కేసులో నిందితుల అరెస్ట్

కొల్లాపూర్:

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలుకి చెందిన దామోదర్ గౌడ్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మృతుడి భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

# నరసరావుపేట కోర్టు వద్ద ఇద్దరు వ్యక్తులు కిడ్నాప్

పల్నాడు నరసరావుపేట కోర్టు వద్ద ఇద్దరు వ్యక్తుల కిడ్నాప్ కలకలం రేపింది. ప్రకాశం జిల్లా సంతమాగులూరు కి చెందిన ప్రశాంత్ రెడ్డి ,వీరాస్వామి రెడ్డి చెక్ బౌన్స్ కేసులో కోర్టుకు వచ్చారు. కోర్టు వద్ద ఉన్న ఓ టిఫిన్ హోటల్ వద్ద ఉన్న ఇద్దరినీ గుర్తు తెలియని వ్యక్తులు వాహనం లో లాక్కుని వెళ్లారు. తరువాత వారిని అతికిరాతకంగా నరికి సంతమాగులూరు వద్ద బాడీ లను పడేసారు.

# దోచేస్తున్న ప్రైవేట్ ఫైనాన్స్ లు

నిజామాబాద్, జూలై 23,

మాన్యులనే అస్త్రంగా చేసుకొని కొందరు, కొన్ని ప్రైవేటు ఫైనాన్సు సంస్థలు రెచ్చిపోతున్నారు. గ్రామాల్లోకి వచ్చి రుణాలు ఇస్తామంటూ తిరుగుతున్నారు. పెంకు టిల్లు, రేకుల షెడ్డు ఉన్నా రుణాలు ఇస్తామం టూ నమ్మ బలుకుతున్నారు. రుణాలు తీసుకున్న తర్వాత పిడిస్తున్నారు. సక్రమంగా నెలసరి కిస్తీలు చెల్లించని వారి పై బెదిరింపు లకు పాల్పడుతున్నారు. పెంకుటిల్లు మీద సుమారు 3 నుంచి 4 లక్షల వరకు, రేకుల ఇంటికి 3 లక్షలు, స్లాబ్ ఉన్న ఇంటికి 8 లక్షల వరకు రుణాలు ఇస్తామంటూ గృహ లపై రుణాలు ఇచ్చే వారు తిరుగుతున్నారు. రుణాలు తీసుకునేంత వరకూ సులభమైన పద్ధతి అంటూ అక్కడే లాగిన్ పూర్తి చేసి ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నారు. అయితే నెలనెలా తిరిగి చెల్లించే కిస్తీ డబ్బుల సమయంలో చెల్లించాల్సిన దాని కంటే అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. రుణం పొందే వరకు మాయ మాటలతో మభ్యపెడుతున్నారు. ఒకసారి రుణం మంజూరు అయిందంటే తిరిగి నెల నెలా చెల్లించాల్సిన డబ్బులకు రెండింతలు వసూలు చేస్తున్నారు. అయితే ఒక నెల కిస్తీ చెల్లించకపోయినా ససేమిరా అంటూ మొండిగా ఇళ్లలోకి చొరబడినంత పని చేస్తున్నారు. రుణం ఇచ్చే సమయంలో తక్కువ వడ్డీనే అంటూ చెప్పి రుణం పొందిన తరువాత ఎక్కువ మొత్తంలో వడ్డీ వసూలు చేస్తూ సామాన్య, మద్యతరగతి వారి రక్తాన్ని పిండేసిన విధంగా వ్యవహరి స్తున్నారు. దీంతో సామాన్యులు మధ్య తరగతి ప్రజలు ప్రాణాలు కోల్పోతు న్నారు. పరువు పోతుందని ఫైనాన్స్ వేధింపుల వల్ల ప్రాణా లు కోల్పోతున్న సంఘటనలు కామారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అయినా ఫైనాన్స్ వల్ల ఆగడాలు ఆగలేకపోతున్నాయి. అరికట్టాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. దీంతో ఫైనాన్సు వారు రెచ్చిపోతున్నారు. నెల నెల మామూలు ఇచ్చి ఆగడాలు సాగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రం లో అనేకమైన ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు నెలకొల్పారు. పేదొళ్ల డబ్బుల అవసరాన్ని ఆసరగా చేసుకొని వారి జీవితాలతో చలగాటం ఆడుతున్నారని పలువురు బాదితులు పేర్కొంటున్నారు. కామారెడ్డి చుట్టు పక్కల గ్రామీణ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఫైనాన్సు సంస్థలు రెచ్చిపోతున్నాయి. దీంతో ఎక్కడ అప్పు పుట్టే పరిస్థితి లేకపోవడంతో సామాన్య, మద్యతరగతి కుటుంబాలు ప్రైవేటు సంస్థలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించి సదరు బాదితుల నుంచి పెద్ద మొత్తంలో వడ్డీని వసూలు చేసేలా పంజా విసురుతున్నారు. ఒక్క నెల చెల్లించకపోయినా బెదిరింపులకు గురి చేస్తున్నారు. అలాగే ఇంటి తాళాలు వేసి జప్తు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. అయితే రుణం ఇచ్చే సమయంలో ఇవేమి చెప్పకుండా సంతకాలు పెట్టించుకుంటు న్నారు. ఆ తరువాత మా వద్ద అన్నీ లీగల్ గా ఉన్నాయని మీరు ఎక్కడికి వెళ్లినా మమ్ములను ఎవరూ ఏమి చేయలేరంటూ మాట్లాడుతున్నారని వాపోతున్నారు. అలాగే కొందరి ఇంటి మీద తీసుకున్న రుణాలకు సంబందించి ఒకటి, రెండు నెలలు కిస్తీ డబ్బులు చెల్లించకపోతే ఆ ఇంటిపై రంగు పూసి తమ ఆధీనంలో ఉందని రాస్తున్నారని పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే అవసర మైతే ఇంటి నుంచి గెంటేసి ఇల్లును జప్తు చేసుకునే హక్కు మాకు ఉందంటూ బెదరిం పులకు దిగడంతో లబ్దిదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఎంతో మానసిక ఆవేదనకు గురవుతున్నారు. అయితే ప్రైవేటు ఫైనాన్సు వ్యాపారులు ముక్కు పిండి మరీ వడ్డీ రూపంలో రెండింతలు వసూలు చేస్తున్నారని పలువురు బాదితులు తమ గోడును వెలిబుచ్చుతున్నారు. ఇటువంటి ప్రైవేటు ఫైనాన్సు లపై ప్రభుత్వం ప్రత్యేక నజర్ పెట్టాలని లేకుంటే పరిస్థితి ఆందోళనంగా మారే అవకాశం ఉంటుందని వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడం.. రైతులు పంటలు సాగు చేసే కాలం, అలాగే కూలీ నాలి చేసుకునే సమయంలోనూ ఫైనాన్స్ వారు వదలడం లేదు. పంట డబ్బులు వచ్చిన తరువాత మొత్తం చెల్లించి క్లియర్ చేస్తామని చెప్పినా వినడం లేదంటూ వాపోతున్నారు. ఇదే కాకుండా ఫోన్లు చేస్తూ బెదిరింపులకు గురి చేయడంతో రుణం పొందిన వారు ఉలికిపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇవన్నీ చెప్పకుండా సామాన్య ప్రజలతో ముందుగానే అన్ని ఒప్పందాల పత్రాలపై సంతకాలు చేయించుకొని ఇటువంటి భయాందోళనలకు పాల్పడుతు న్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రైవేటు ఫైనాన్సు లను కట్టడి చేయాలని లేకుంటే మద్యతరగతి, సామాన్య ప్రజలు గోస పడక తప్పదని పేర్కొంటు న్నారు.

# సింహాద్రిలో వైభవంగా స్వామివారి నిత్య కళ్యాణం

సింహాచలం

ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

# అరెస్ట్ సెంటిమెంట్....

నెల్లూరు, జూలై 23,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు కక్ష సాధింపులకు కేరాఫ్ అడ్రస్ లుగా మారాయి. గతంలో ఎన్నడూ లేని పరిస్థితులు ఇప్పుడు నెలకొన్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును యాభై రెండు రోజుల పాటు జైలులో ఉంచారు. స్కిల్ డెవలెప్ మెంట్ స్కామ్ కేసులో చంద్రబాబును నంద్యాల పర్యటనలో ఉండగా అరెస్ట్ చేసి రాజమండ్రి జైలులో ఉంచారు. నాడు చంద్రబాబు అరెస్ట్ తోనే సానుభూతి పెల్లుబుకింది. ఏడు పదులు దాటిన వయసులో చంద్రబాబును అరెస్ట్ చేయడాన్ని అన్ని వర్గాల ప్రజలు నాడు వ్యతిరేకించారు. దాని పర్యవసానమే గత ఎన్నికల్లో వైసీపీ కేవలం పదకొండు సీట్లకే పరిమితమయింది. అమలు చేసిన సంక్షేమ పథకాలు కూడా అక్కరకు రాకుండా పోయాయి. ఇప్పుడు రాజకీయాల్లో అవినీతి కామన్ అయిపోయింది. అదే సమయంలో సానుభూతి మాత్రం పుష్కలంగా ఉంది. గత ప్రభుత్వంలో అనేక కేసులతో జైలుకు వెళ్లిన అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ధూళిపాళ్ల నరేంద్రతో పాటు అందరూ మొన్నటి ఎన్నికల్లో గెలుపొందడాన్ని ఎవరూ మరిచిపోలేరు. అవినీతి చేస్తే జైలుకు వెళ్లడం అన్నది ఒకరకంగా కామన్ అయిపోయింది. జైలుకు వెళ్లి వస్తే మాత్రం అవినీతిని పక్కన పెట్టి ప్రజలు సానుభూతితో ఓట్ల వర్షం కురిపించడం మామూలుగా మారిపోయింది. గతంలో ఇలాంటి పరిస్థితులు ఉండేవి కావు. 2019 ఎన్నికల్లోనూ జగన్ లక్ష కోట్ల అవినీతి చేశారంటూ చంద్రబాబు, టీడీపీ పదే పదే ప్రచారం చేసినా గెలుపును ఆపలేకపోయారు.... ఇప్పుడు టీడీపీ వంతు వచ్చేసింది. వరసబెట్టి వైసీపీ నేతలు అరెస్టవుతున్నారు. నందిగం సురేష్, పోసాని కృష్ణమురళి, వల్లభనేని వంశీ, కాకాణి గోవర్ధన్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మిథున్ రెడ్డి ఇలా అందరూ వివిధ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చారు. వీరిపైన కూడా సానుభూతి పొంగిపొరలుతుందని గ్యారంటీగా చెప్పొచ్చు. ఇప్పటికే కక్ష సాధింపు చర్యలతో రాజకీయ కక్షలతో అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్న ప్రచారాన్ని వైసీపీ జోరుగా చేస్తుంది. ప్రజలు కూడా ఆ ప్రచారానికి కనెక్ట్ అవుతున్నారు. అంటే జైలుకు వెళ్లిన నేతలపై క్రమంగా జనంలో సానుభూతి పెరుగుతుందని ఖచ్చితంగా అంచనా వేయవచ్చు. అధికారంలో ఉన్న ఏ పార్టీ అయినా చట్ట తన పని తాను చేసుకుపోతుందన్న కామన్ డైలాగులు ఎన్నికల సమయంలో పనిచేసే అవకాశలుండవన్న విశ్లేషణలు వస్తున్నాయి. జగన్ అరెస్ట్ కావాలంటూ... ఇక మద్యం కుంభకోణం కేసులో వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూడా జైలుకు వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. వైసీపీ నేతలు కూడా కోరుకుంటున్నదదే. మహా అయితే జైలుకు వెళితే రెండు నుంచి మూడు నెలలకు మించి లోపల ఉండమని, బయటకు వచ్చిన తర్వాత ఖచ్చితంగా జనంలోకి వెళ్లడానికి ఒక దారి దొరుకుతుందన్న భావన వైసీపీ నేతల్లో వ్యక్తమవుతుంది. నాడు టీడీపీ నేతలు కానీ, నేడు వైసీపీ నేతలు కాని ఎన్ని కేసులుంటే అంత రాజకీయంగా మంచిదన్న వాతావరణం ఏర్పడింది. అధికారంలో ఉన్న ప్రతి పార్టీ కూడా జైలుకు వెళ్లివచ్చినంత మాత్రాన గెలిచే అవకాశం ఉండదన్న అతి విశ్వాసాన్ని నాడు వైసీపీ, నేడు టీడీపీ ప్రదర్శిస్తున్నాయి. మరి వచ్చే ఎన్నికల నాటికి ఏం జరుగుతుందో చూడాలి

# అటకెక్కిన వివేకా కేసు

కడప, జూలై 23,



వివేకానంద రెడ్డి హత్య కేసులో ఏం జరుగుతోంది? ఎటువంటి పురోగతి లేదు ఎందుకు? ఇంకా ఈ కేసు కొలిక్కి తేవాలంటే సిబిఐ కి ఎన్ని రోజులు పడుతుంది? తెర వెనుక ఏం జరుగుతోంది? రాజకీయ కోణంలోనే జాప్యం జరుగుతోందా? లేకుంటే పరోక్ష శక్తులు ఆటంకాలు చేస్తున్నాయా? ఇప్పుడు అన్ని వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. నిన్ననే సుప్రీంకోర్టులో అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు పై విచారణ జరిగింది. ఆ సమయంలో సుప్రీంకోర్టు మూడు అంశాలను తెరపైకి తెచ్చింది. అసలు సిబిఐ ఇంకా విచారణ చేపట్టాల్సి ఉందా? అనే ప్రశ్న వేసింది. ఈ కేసు విచారణకు సంబంధించి సుప్రీంకోర్టు విధించిన గడువు ముగియడంతో ఈ ప్రశ్న వేసింది. అయితే వైసిపి ప్రభుత్వ హయాంలో సిబిఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ యంత్రాంగం సహకరించలేదన్నది అప్పట్లో వచ్చిన ఆరోపణ. తిరిగి దర్యాప్తు చేస్తున్న సిబిఐ అధికారులను భయపెట్టే పరిస్థితులు ఉండేవని అప్పట్లో టిడిపి అనుకూల మీడియా వార్తలు ప్రచురించింది. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. కానీ కనీస స్థాయిలో వివేకానంద రెడ్డి హత్య కేసు ముందుకు సాగడం లేదు. దీనిని ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారా? లేకుంటే 2029 ఎన్నికల సమయానికి మరింత బిగుసుకునేలా కేసు తెరపైకి తేనున్నారా అన్న అనుమానాలు అయితే కలుగుతున్నాయి. తెర వెనుక ఏదో జరుగుతోందన్న అనుమానాలు బలపడుతున్నాయి. 2019 మార్చి 15న దారుణ హత్యకు గురయ్యారు వివేకానంద రెడ్డి. అయితే అప్పుడు టిడిపి అధికారంలో ఉంది. సిఐడి విచారణకు ఆదేశించింది చంద్రబాబు సర్కార్. అయితే సిఐడి కాదని.. సిబిఐతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు జగన్మోహన్ రెడ్డి. దీంతో సిబిఐ విచారణ ప్రారంభించింది. ఆ ఎన్నికల్లో వివేకానంద రెడ్డి హత్య అంశం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో ప్రయోజనం చేకూర్చింది. సానుభూతి వర్కౌట్ అయింది. జగన్ అధికారంలోకి వచ్చారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ దర్యాప్తు అవసరం లేదని తేల్చి చెప్పారు. దీంతో వివేక కుమార్తె సునీత రంగంలోకి దిగారు. న్యాయ పోరాటం చేయడంతో సిబిఐ విచారణ కొనసాగింది. అయితే ఏపీ ప్రభుత్వం నుంచి సహాయ నిరాకరణ, నిందితుల నుంచి దర్యాప్తు అధికారులకు బెదిరింపులు వంటివి చోటు చేసుకున్నాయి. దీంతో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శకంగా వివేకానంద రెడ్డి హత్య కేసును దర్యాప్తు చేయిస్తామని.. నిందితులకు శిక్ష పడేలా చేస్తామని చంద్రబాబు చెప్పుకొచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న ఈ కేసు విచారణలో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ప్రస్తుతం వివేకానంద రెడ్డి కుమార్తె సునీత గట్టిగానే పోరాటం చేస్తున్నారు. తన తండ్రిని చంపిన నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పలుమార్లు హోంమంత్రి అనిత తో పాటు బిజెపిని కూడా కలిశారు. కానీ ఆ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి చర్యలు ప్రారంభం కాలేదు. దీంతో వివేకానంద రెడ్డి హత్య కేసు వెనుక ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. అయితే తప్పకుండా దీనిపై చర్యలు ఉంటాయని.. అదును చూసి కూటమి ప్రభుత్వం దెబ్బ కొడుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఆ పని ఎప్పుడు జరుగుతుందో చూడాలి.

# నాలుగు నెలలుగా జీతాల్లేని టీచర్స్

నల్గొండ, జూలై 23,


వారంతా చిరుద్యోగులే. నెలంతా పనిచేస్తే వారికొచ్చే జీతం రూ.15 వేల నుంచి రూ.19,500 వరకే. ఈ కాస్తంతా జీతం కూ డా అందక ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి రాష్ట్రం లోని మోడల్ స్కూళ్లలో నెలకొంది. గత నాలుగు నెలలుగా వారికి జీతాలు అందడంలేదు. మరో పది రోజులు గడిస్తే జూలై నెల కూడా పూర్తవుంతోంది. కానీ ఇంతవరకు వారికి జీతాలు అందని పరిస్థితి. నెలంతా ప నిచేస్తే ఇవ్వాల్సిన వేతనాలను సమయానికి అందించకపోవడంతో మోడల్ స్కూళ్లలో పనిచేసే ఔట్ సోర్సింగ్ సిబ్బంది తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రతి నెలా జీతాలు ఆలస్యమవుతుండటం తో కుటుంబాలు గడవలేని పరిస్థితి అని ఉ ద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈవిధంగా నెలల తరబడిగా వేతనాలు విడుదల చేయకపోవడం సరైంది కాదని నిలదీస్తున్నారు. ఒకవైపు చాలీచాలని వేతనాలు, దీనికితోడూ ఆలస్యంగా ఇస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అసలే నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైంది. పిల్లలకు పుస్త కాలు, యూనిఫామ్ కొనాలన్న తమ వద్ద డబ్బులు ఉండడంలేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో 194 మోడల్ స్కూళ్లు ఉన్నా యి. ఒక్కో స్కూల్లో కంప్యూటర్ ఆపరేటర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, అటెండర్, నైట్ వాచ్‌మెన్ పనిచేస్తున్నారు. వీరందరికీ గత మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెల వేతనాలు అందాల్సి ఉంది. ఇవి ఇంతవరకు పెండింగ్‌లోనే ఉన్నాయి. జూలై నెల గడుస్తోంది. ఇం కో వారం, పది రోజులైతే ఐదు నెలల వేతనాలు ఉద్యోగులకు చెల్లించాల్సి ఉంటుంది. ఒకట్రెండు నెలలు వేతనాలు ఆలస్యమైతే సర్దుకోవచ్చు కానీ నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. జీతాలు ఎప్పుడొస్తాయో తెలియకపోవడం తో ఉద్యోగులు ఇంటి అద్దె, నెలవారి ఖర్చు లు, ఈఎంఐలు, ఇతర చెల్లింపుల విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. పెనాల్టీలతో చెల్లింపులు చేస్తున్నట్లు వాపోతున్నారు. కుటుంబాలు కూడా గడచే పరిస్థితిలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్నేహితులు, తెలిసిన వాళ్ల దగ్గర అప్పు చేసి కు టుంబాలను పోషించుకుంటున్నారు. ఇదేదో ఒక నెల, రెండు నెలలు కాదు. ప్రతిసారి ఆలస్యంగానే అందుతున్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. నేడు, రేపు అంటూ ఎప్పుడు వేతనాలు వస్తాయోనని ఎదురుచూడాల్సిన పరిస్థి నెలకొందంటున్నారు. ఇంటి నుంచి స్కూళ్లకు వెళ్లేందుకు కనీసం బైక్ పెట్రోల్‌కు డబ్బులు కూడా ఉండడం లేదని ఓ ఉద్యోగి వాపోయాడు. జీతాలు అందక చిరుద్యోగులు విలవిల్లాడుతున్నారు. వచ్చేదే అరకొర జీతం. దీనికి నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. జీతాల కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండడంలేదని మోడల్ స్కూల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వాపోతున్నారు. వీరి వేతనాలకు సంబంధించిన బిల్లులు ఇప్పటికే స్టేట్ ఆఫీస్‌కు చేరాయి. ఇక్కడి నుంచి అధికారులు సైతం ఆర్థికశాఖకు పంపించారు. పంపించి రోజులు గడుస్తున్నా బిల్లుల విడుదలకు ఇంకా క్లియరెన్స్ రావడంలేదు. బడ్జె ట్ లేదని అధికారులు సమాధానం చెబుతున్నట్లు ఉద్యోగులు వాపోతున్నారు. అప్రూ వల్ కాగానే జమ చేస్తామని అంటున్నారు. పైగా వచ్చినప్పుడే తీసుకోవాలని అధికారులు బదులిస్తున్నారు. తక్షణమే నాలుగు నెలల జీతాలు విడుదల చేయాలి. మా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయి. నిత్యావసర సరుకులు, రోజూవారి ప్రయాణ ఖర్చులకు డబ్బులు ఉండడంలేదు. గత ఆరు నెలలుగా ఇదేతంతు. సకాలంలో జీతాలు వేయడంలేదు. మొక్కుబడిగా జీతాలు చెల్లిస్తున్నారు. ప్రతినెలా ఒకటో తారీఖున మాకు జీతాలు వేయాలి. జీతాలు ఆలస్యం కావడంతో ఈఎస్ఐ, పీఎఫ్ సకాలంలో చెల్లించడంలేదు.

# అపర భగీరధుడు సర్ ఆర్ధర్ కాటన్

## -నేడు ఆయన వర్ధంతి

( పెండ్యాల రామ్ కుమార్,మంథని )

మానవ జాతి వికాసానికి సృష్టి అందించిన వరప్రసాదమే సర్ ఆర్ధ్ కాటన్. మద్రాసు రాష్ట్రంలో వారు అమలు చేసిన నీటి పారుదల పనులు అద్వితీయమైన విజయాలు సాధించాయి. సర్ ఆర్ధర్ కాటన్ దూరదృష్టి, సునిశిత మేధాశక్తి అమోఘం, అద్వితీయం. దక్షిణ భారతావనిలో ఎన్నో నీటి పారుదల రూపకల్పన చేసిన అన్న దాత.. సర్ ఆర్ధర్ కాటన్ ను ప్రభుత్వం సముచితంగా అనేక బిరుదులతో సన్మానించింది. 1803 మే 15వ తేది కాటన్ జన్మించారు. కుటుంబంలో అందరికంటే తల్లి వ్యక్తిత్వ ప్రభావం ఆయనపై పడింది. కాటన్ చిన్నతనం నుంచి మనో వికాసానికి సాహసానికి, ధైర్యానికి, దీక్షకు మారుపేరు. తల్లి ఇచ్చిన శిక్షణ కాటన్ కి ఎంతో ఉపక రించింది. 15 ఏళ్ళ ప్రాయంలో ఇండియాకు వెళ్ళడానికి స్కాలర్ షిప్ పొందారు. 1819 లో ఆర్ధర్ కాటన్ జాగ్రత్తగా చదువుకొని మంచి క్రమశిక్షణతో మెలిగి అది స్కాంబి లో చక్కగా విద్యనభ్యసించి ఏ పరీక్షకు హాజరు కాకుండానే రాయల్ ఇంజనీర్ సర్టిఫికేట్ ఆధారంగా ఉద్యోగం సంపాదించారు. 1821 లో 18 సంవత్సరాల ప్రాయంలో ఇండియాలో ఉద్యోగంలో నియమింపబడ్డారు. 1822 సంవత్సరం లో అనేక జిల్లాల్లోని చెరువు మరమత్తు పనులను పర్యవేక్షించే పనిని అప్పగించారు. 1824 సంవత్సరం వరకు ఈవిధంగా పనిచేసి మద్రాసు దక్షిణాన కొన్ని మైళ్ళ దూరంతో వున్న మిలిటరీ స్థావరమైన ధామస్ మౌంట్ దగ్గర భవనాలు నిర్మించడానికి నియమించబడిరి. ఎనిమిదేళ్ళ సర్వీసు అయిన తర్వాత కెప్టెన్ ర్యాంక్ కు ఎదగారు. ఆయల కృషి వల్ల తంజావూరు జిల్లాలోని అనే నిర్మాణపు పనులు పూర్తి అయి రాష్టంతో సంపన్న జిల్లా గా మారింది. 1828 - 29 సంవత్సరాలలో అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశారు. తరువాత అనారోగ్య కారణాలవల్ల ఇంగ్లాండు తిరిగి వెళ్ళనలసి వచ్చింది.



1832 లో తిరిగి ఉద్యోగంలో ప్రవేశించారు. శక్తికి మించిన శ్రమ చేయడం వల్ల తరచు అనారోగ్యానికి గురయ్యేవారు. ఈసారి ఆస్ట్రేలియాకు వెళ్ళవలసి వచ్చింది. అక్కడ వుండగా ఒక ధనవంతుని కుమార్తె ఎలిజబెత్ ని ప్రేమించి వివాహమాడారి. 1841 సంవత్సరం లో అక్టోబరు 10వ తేదీన వీరి వివాహం జరిగింది. తరువాత తిరిగి టాస్మోనియా వెళ్ళారు. ఆ సమయంలో రాజమండ్రి జిల్లా పరిస్తితి అద్వాహ్నంగా ఉండేది. గోదావరి తో పారే నీటిని వినియోగించి ఆ భూములను సస్యశ్యామలం చేయటం జరిగింది. అప్పటినుంచీ రాజమండ్రి జిల్లా గోదావరి జిల్లా గా పేరు గాంచింది. గోదావరి నదిపై 12 లక్షల ఎకరాల సాగుకు ఉపయోగపడే ఒక ఆనకట్ట నిర్మించబడింది. ఈ ఆనకట నిర్మాణం ద్వారా ఆయన కన్న కలలు నిజమయ్యాయి. కాల్వలు తరువాత కాల్వలు, పిల్లకాత్వతు, పంట కాల్వలు త్రవ్వడం జరిగింది. 1841 నుండి 45 ఏండ్లు నీటి పారుదల పథకాల అమలుకై ఆయన నిర్విరామ కృషి చేశారు. 1881లో ప్రచురించిన "వీలున్నచోట నీటి పారుదలకు కాల్వలను ఏర్పాటు చేయాలి. వర్షపు నీరు, బావి నీరు, ఇతర విధానాల ద్వారా లభించే నీటి కన్నా భూమిని సారవంతం చేసే ఎరువు గల్గిన నీటుని పొలాలలకు కాల్వుల దారా పారించవచ్చును. "ఒక చోటినుండి ఇంకొక చోటికి ఉత్పత్తులను కారు చౌక ఎగుమతి చేయడానికి నీటి కంటే మరొక ఉత్తమ సాధనం లేదు. ఆ కారణంగా నీటి పారుదల కాల్వలను స్టీమ్ బోట్ లు తిరగడానికి వాలుగా నౌకాయాన సౌకర్యాలు కల్పించారు. ధవళేశ్వరం ఆలకట్ట నిర్మాణంలో సర్ ఆర్ధర్ కాటన్ చూపిన ప్రతి భాపాటవాలు నేటికి మరువలేనివి. ఈ బ్యారేజి నిర్మాణం వల్ల గోదావరి డెల్టాలో 13,75,000 టన్నులు, ధాన్యము, 16,38,000 చెరుకు, 34,000 టన్నుల పప్పు ధాన్యము, చిరుధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ వ్యారేజి నిడిని 3.6. కి.మీ. దేశంతో కెల్ల అతి పెద్దదైల ధవళేశ్వరం బ్యారేజి సర్ ఆర్ధర్ కాటన్ బ్యారేజిగా పిలువ బడుతున్నది. ఇండియాలో పబ్లిక్ వర్క్స్ అనే పుస్తకాన్ని కూడా ఆయన రాసారు. మానవ జాతి మహోదయానికి ఇంజనీరుగా రచయితగా ఆలోచలా పరులుగా శ్రీ కాటన్ చేసిన కృషి చిరస్మరణీయమైంది. ఆయన పేదరిక నిర్మూలనకు కరువు నివారణకు అనేక నీటి పధకాలు అమలు చేసి చరిత్ర ప్రసిద్ధుడైయాడు. ఎన్ని పనులు చేసినా ఆయన సామాన్యుడే. ధర్మాన్ని నిర్వర్తించాడు. అభివృద్ధే ఆయన ఆదర్శం. అందుకే ఆయునను అన్నదాతగా పిలిచేవారు. ప్రజల హృదయాలలో శాశ్విత స్థానాన్ని ఏర్పరచుకొని 1899 జులై 24వ తేది పరమపదించారు.

# ఇంటినెంబర్లతో రిజిస్ట్రేషన్స్..

కరీంనగర్, జూలై 23

కరీంనగర్ జిల్లాలో గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి నంబరుతో ఆస్తుల రిజిస్ట్రేషన్లకు అనుమతి లభించింది. అక్రమ రిజిస్ట్రేషన్లను నిరోధించడానికి, పారదర్శకతను పెంచడానికి ఇంటి కొలతలు, విస్తీర్ణం, ఎన్వోసీ వంటి నిబంధనలు తప్పనిసరి చేశారు. ఈ నిర్ణయంతో గ్రామాల్లో క్రయవిక్రయదారులకు ఊరట లభించింది. అయితే, పురపాలికలు, నగరపాలికల్లో, ముఖ్యంగా కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండితో పాటు కొత్తపల్లి, రేకుర్తిలోని 200 సర్వే నంబర్లలో ఇంకా రిజిస్ట్రేషన్లపై స్పష్టత లేకపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గ్రామాల్లోని ఇళ్ల క్రయవిక్రయాలకు ఇంటి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటును అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా ఉత్తర్వులు ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతోపాటు తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లకు చేరాయి. ఇళ్ల క్రయవిక్రయాలు జరిపే క్రమంలో రిజిస్ట్రేషన్ల సమయంలో విధిగా నిబంధనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. విక్రయించే ఇంటిని పరిశీలించి, ఇంటి విస్తీర్ణం కొలతలు, నాలుగు వైపులా ఉన్న వారి వివరాలు, స్లాబ్ ఏరియాతోపాటు సంబంధిత డాక్యుమెంట్లతో కూడిన ఎన్వోసీ ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ చర్యలు అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేసి, పారదర్శకతను పెంచేందుకు ఉద్దేశించినవి అన్నారు.కాగా, గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించిన అధికారులు, పురపాలికలు, నగరపాలికల్లో మాత్రం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కరీంనగర్ నగరపాలిక, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి పురపాలికల్లోని ఇళ్ల క్రయవిక్రయాలకు సంబంధించి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కొత్తపల్లి, రేకుర్తిలోని దాదాపు 200 సర్వే నంబర్లలో భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు ఇప్పటికీ నిషేధంలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని ప్రజలు తమ ఆస్తులను క్రయవిక్రయాలు చేసుకోలేక తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో తీసుకున్న సానుకూల నిర్ణయం పురపాలికలు, నగరపాలికలకు కూడా వర్తింపజేయాలని అక్కడి ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఇక గ్రామాలను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు అటవీ శాఖ అనుమతులు లభించకపోవడంతో ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సారంగాపూర్, రాయికల్ మండలాల్లో అత్యధిక అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ అడవుల మధ్య నుంచే పలు రహదారులు వెళ్తాయి. గతంలో ప్రభుత్వం ఈ గ్రామాలను కలుపుతూ రహదారుల నిర్మాణం చేపట్టినా, అటవీ ప్రాంతంలో అనుమతులు లేకపోవడంతో పనులు నిలిపివేశారు. కొంతకాలంగా రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులు అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపుతున్నప్పటికీ, ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. దీనివల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందడం లేదు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు త్వరగా అనుమతులు మంజూరు చేసి, నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

# స్వగ్రామానికి చేరుకున్న జవాన్ ఆకాష్ మృతదేహం.. అమరుడికి ప్రజల అశ్రునివాళి.

అదిలాబాద్

దేశ సేవ చేయాలనీ కలలు కన్న బజార్హత్నూర్ మండలం వర్త మన్నూర్ గ్రామానికి చెందిన జవాన్ ఆకాష్ (24) మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. ఆకాష్ దృఢ సంకల్పంతో కష్టపడి అస్సాం రైఫిల్స్ లో కొలువు సాధించాడు. అస్సాం రాష్టం లో శిక్షణ లో భాగంగా 20 కిలోమీటర్ల పరుగు సాధన చేస్తుండగా రెండు రోజుల క్రితం కుప్పకూలీ మృతి చెందారు. దేశ సేవ చేయలనే సంకల్పం నెరవేరకుండానే కానరాని లోకాలకు వెళ్లడంతో గ్రామము శోక సంద్రంలో మునిగిపోయింది. ఆకాష్ మృతదేహము ఇచ్చోడ మండల కేంద్రం నుండి వర్త మన్నూర్ గ్రామం వరకు భారీ ఊరేగింపుగా సాగింది. ప్రజలు భారీగా తరలి వచ్చారు. భారత్ మాతాకీ జై అంటూ ఊరేగింపు సాగింది.

# అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సూర్యాపేట

సూర్యాపేట జిల్లా తునీగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్య నాయకులు తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ పాల్గొన్నారు. సంపత్ కుమార్ మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి ఒక్కొక్క పదవికి ఇచ్చిన ప్రజెంటేషన్ కాగితాలు చూస్తుంటే ఆశావాహులు అనేకమంది ఉన్నారని, తుంగతుర్తి లో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉన్నదని,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 100 కి 100% స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కడతారని నమ్మకం విశ్వాసం ఉందని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అన్నారు.

# ఫ్రీ బస్సులకు చకచకా ఏర్పాట్లు

అమరావతి, జూలై 23, (




ఎన్నికల హామీలపై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వ. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న క్రమంలో సంక్షేమ పథకాలపై ఫుల్ ఫోకస్ చేసింది. ఇప్పటికే తల్లికి వందనం పథకం అమలు చేసింది. విద్యా సంవత్సరం ప్రారంభం రోజున ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఈ పథకం వర్తింపజేసింది. మరోవైపు తల్లికి వందనం రెండో విడత నిధులు కూడా జమ చేసింది. ఒకటో తరగతి ప్రవేశాలు పొందిన విద్యార్థులతో పాటు ఇంటర్లో చేరిన వారికి సైతం నిధులు జమ చేసింది. అంతటితో ఆగకుండా వివిధ సాంకేతిక కారణాలతో ఈ పథకం నిలిచిపోయిన వారికి సైతం తప్పులు సరిచేసి అందించింది కూటమి ప్రభుత్వం. ఇదే స్ఫూర్తితో అన్నదాత సుఖీభవ పథకానికి సైతం అన్ని ఏర్పాట్లు చేసింది. మరోవైపు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణానికి సంబంధించి పథకానికి కూడా కసరత్తు ప్రారంభించింది. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తాజాగా ప్రకటించింది. ఈరోజు ఈ పథకానికి సంబంధించి సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష జరిపారు. ఈ పథకానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు.ఏపీలో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలోఉచిత ప్రయాణ పథకం ప్రారంభం కానుంది. అయితే ఈ పథకానికి సంబంధించి మహిళలకు జీరో పేరో టికెట్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఎక్కడ నుంచి ఎక్కడకు ప్రయాణం చేస్తున్నారు? ఉచిత ప్రయాణంతో వారికి డబ్బులు ఎంత ఆదా అయ్యాయి? 100% ప్రభుత్వం ఇస్తున్న రాయితీ వంటి వివరాలు ఆ టిక్కెట్లు ఉండాలని స్పష్టంగా చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు. అంటే ఆర్టీసీలోప్రయాణించే ప్రతి మహిళకు జీరో ఫెయిర్ టికెట్ ఇవ్వడం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ధి, దాని ద్వారా ఎలా ప్రయోజనం చేకూరుతుంది అనేది వారికి స్పష్టమయ్యే అవకాశం ఉంది.కేవలం ఆధార్ కార్డుచూపిస్తే ఉచిత ప్రయాణం కల్పిస్తే మహిళలకు ప్రభుత్వం ఉదారత అర్థమయ్యే అవకాశం లేదు. అందుకే వారికి ఇచ్చే జీరో ఫేర్ టిక్కెట్ పై అన్ని వివరాలు పొందుపరచాలని నిర్ణయించారు. ఎందుకు సంబంధించి ప్రత్యేక సాఫ్ట్వేర్ రూపొందించాలని ఆదేశించారు సీఎం చంద్రబాబు. ఈరోజు సచివాలయంలో మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకం పై అధికారులతో సీఎం సమీక్షించారు. ఈ పథకంతో రాష్ట్ర ప్రభుత్వం పై ఎంత భారం పడనుంది? ఎంతమంది మహిళలు ప్రయాణించే అవకాశం ఉంది? అదనంగా ఎన్ని బస్సులు అవసరం అవుతాయి? అన్న విషయాలపై అధికారులతో చర్చించారు. హామీఇచ్చిన మాదిరిగానే ఆగస్టు 15 నుంచి సమర్థవంతంగా ఈ పథకాన్ని అమలు చేస్తామని సీఎం చంద్రబాబు.అయితే మహిళలకు ఉచిత ప్రయాణ పథకంతో ఆర్టీసీ పై పెను ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది ఏపీఎస్ఆర్టీసీ. అందుకే ఇతర ఆదాయ మార్గాలు పెంపొందించుకోవడం, నిర్వహణ వ్యయం తగ్గించుకోవడం వంటి వాటిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు ఏపీ సీఎం చంద్రబాబు. ఎందుకుగాను ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ బస్సులు అందుబాటులోకి వస్తాయని ప్రస్తావించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున. ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. మొత్తానికైతే ఆగస్టు 15 నుంచి ఏపీలో మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నమాట

# కమలంలో కల్లోలమేనా...

హైదరాబాద్, జూలై 23, (



దాపరికమేమీ లేదు. దాచినంత మాత్రాన దాగదు. భారతీయ జనతా పార్టీలో వర్గాలు ఏర్పడ్డాయి అనేది నిజం. అందులో కిషన్ రెడ్డి, బండి సంజయ్ మినహా మిగతా వారంతా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే.. ఇప్పుడు ఎంపీలుగా ఉన్న కొండ విశ్వేశ్వర్ రెడ్డి, డీకే అరుణ, గోడం నగేష్, రఘునందన్ రావు, ఈటెల రాజేందర్ వంటి వారంతా ఇతర పార్టీల లో గతంలో పనిచేసినవారే. రాజకీయ కార్యశాల కోసం వారు తప్పనిసరి పరిస్థితుల్లో భారతీయ జనతా పార్టీని ఎంచుకున్నారుఈటెల రాజేందర్, బండి సంజయ్ మధ్య ఇటీవల మాటల తూటాలు బయటికి వచ్చాయి. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు ఏమన్నారో తెలియదు గాని.. ఈటల రాజేందర్ అన్న మాటలు మాత్రం మీడియాలో సంచలనంగా మారాయి. కొన్ని మీడియా సంస్థలు ఈటెల రాజేందర్ వ్యాఖ్యల పట్ల సమయమనం పాటించగా.. ముఖ్యంగా గులాబీ అనుకూల మీడియా సంస్థలు మాత్రం మొహమాటం లేకుండా ఆ మాటలు అన్నది బండి సంజయ్ ని ఉద్దేశించే అని చెప్పేశాయి. ఇద్దరి మధ్య ఏకంగా వార్ నడుస్తోందని.. 8 మంది పార్లమెంటు సభ్యులను తెలంగాణ నుంచి గెలిపించి పంపిస్తే.. చివరికి వారు చేస్తోంది ఇది అని రాసింది. ఇంత జరిగిన తర్వాత తెలంగాణ పార్టీ అధ్యక్షుడు ఒక సర్క్యులర్ జారీ చేశారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఎవరూ మాట్లాడవద్దని.. అధిష్టానం చూసుకుంటుందని స్పష్టం చేశారు. దీంతో ఆ యుద్ధానికి తాత్కాలిక ముగింపు మాత్రమే ఆయన ఇచ్చారు..ఈటల రాజేందర్ వ్యాఖ్యలు చేసిన తర్వాత కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అతని అనుచరులు కూడా సైలెంట్ అయిపోయారు.. ఆ తర్వాత బోనాల వేడుకలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పాల్గొన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి కూడా ఉన్నారు. ఇద్దరు కలిసి భోజనం కూడా చేశారు. ఒకానొక దశలో ప్రీతి రెడ్డి బిజెపిలో చేరుతున్నారని వార్తలు కూడా వచ్చాయి. దానిపై అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఢిల్లీలో తెలంగాణ ప్రాంతానికి చెందిన పార్లమెంట్ సభ్యులు భేటీ అయ్యారు. వీరిలో డీకే అరుణ, రఘునందన్ రావు, ఈటెల రాజేందర్, గోడం నగేష్, ధర్మపురి అరవింద్, విశ్వేశ్వర్ రెడ్డి ఉన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న సికింద్రాబాద్ ఎంపీ, కరీంనగర్ ఎంపీ ఇందులో కనిపించలేదు.. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి కాబట్టి వీరంతా కూడా ఢిల్లీలో ఉన్నారు.విశ్వేశ్వర్ రెడ్డి పార్లమెంట్ విప్ గా కొనసాగుతున్నారు. తెలంగాణ ప్రాంత పార్లమెంట్ సభ్యులకు ఢిల్లీలోని ఆయన తన అధికారిక గృహంలో విందు కూడా ఇచ్చారు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. కిషన్ రెడ్డి సౌమ్యుడు కాబట్టి.. ఆయన గురించి పెద్దగా ప్రస్తావన ఉండడం లేదు.. కానీ ఎటొచ్చీ బండి సంజయ్ గురించే చర్చ నడుస్తోంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కి మిగతా ఎంపీలకు మధ్య గ్యాప్ ఉందని.. అందువల్లే ఆయనను విశ్వేశ్వర్ రెడ్డి పిలవలేదని కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రచారం చేస్తున్నాయి. అంతేకాదు పార్టీలో ఎంపీలకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కి అంతరం పెరిగిపోయిందని.. ఈటెల రాజేందర్ కు మిగతా ఎంపీల సపోర్టు ఉందని.. అందువల్లే ఈ ఫోటోలు బయటికి వచ్చాయని ప్రచారం నడుస్తోంది. అయితే దీనిపై భారతీయ జనతా పార్టీ సోషల్ మీడియా విభాగం స్పందించే లోగానే జరగాల్సిన ప్రచారం జరిగిపోయింది.. వివరణ ఇచ్చే లోగానే వ్యతిరేక ప్రచారం జోరందుకుంది.8 మంది పార్లమెంట్ సభ్యులను గెలుచుకొని.. అసెంబ్లీ ఎన్నికల్లో పర్వాలేదు అనుకునే స్థాయిలో సీట్లు సాధించుకొని.. కొన్ని జిల్లాలలో పట్టు సాధిస్తున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ఇలా అంతర్గత లుకలుకలతో ఇబ్బంది పడడం.. సోషల్ మీడియాలో చర్చనీయాంశం కావడం పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెడుతోంది. మరి ఈ పరిణామాలకు రామచంద్రరావు ఎలా చెక్ పెడతారో చూడాల్సి ఉంది.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం... మంత్రి శ్రీధర్ బాబు

షాద్ నగర్

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఏర్పాటు చేశారు. ఈ సంబరాలకు ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ నారాయణ రెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.ముఖ్య అతిధిగా పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..... గత 10 సంవత్సరాల కాలం ఉన్న ప్రభుత్వం మహిళల సంక్షేమం, విద్యా, వైద్యం మరచిపోయిందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దాని కొనియాడారు. ఆత్మస్థైర్యంతో ఎదుగుతున్న మహిళలందరికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే గొప్ప ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి ముందుకెళ్తున్నారన్నారు. మహిళా సంఘాలు సమిష్టిగా ఉండి పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుకు నెలకు కేవలం మిత్తిగా 7 వేల కోట్ల రూపాయలు మిత్తి కడుతున్నమ్మన్నారు. అయినా కూడా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీ ని నెరవేరుస్తున్నమన్నారు. రాబోయే మూడున్నర సంవత్సరాలలో మిగిలిన హామీలన్నీ కచ్చితంగా నెరవేర్చి తిరుతామన్నారు. పదేళ్లుగా ఇవ్వని రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరం తర్వాత ఇస్తున్నామన్నారు.కేవలం రంగారెడ్డి జిల్లాలోనే పది వేల నూతన రేషన్ కార్డులను ఇవ్వనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుపై పేదలకు సన్న రకం బియ్యం అందజేస్తున్నామన్నారు.సన్నరకం వరి వేస్తున్న రైతులకు 500 రూపాయలు బోనస్ ఇస్తున్నామన్నారు. ప్రజల కోసం ఇంత చేస్తున్న ప్రభుత్వానికి ఎప్పుడు వెన్నంటే ఉండాలని మహిళలను కోరారు. అభివృద్ధిని చూసి అక్కా చెల్లెలు కాంగ్రెస్ ప్రభుత్వనికి రేపు వచ్చే లోకల్ బాడీ ఎలక్షన్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, బాబర్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్, రఘు నాయక్, చెన్నయ్య, మాజీ జెడ్పిటిసి వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కూతురిని కాలితో తన్నిన తండ్రి కేసు నమోదు

భద్రాద్రి కొత్తగూడెం

బూర్గంపాడు మండలం సారపాక లో కన్న కూతురిని కాలుతో తన్ని భయభ్రాంతులకు గురిచేసిన తండ్రిపై పోలీసులు కేసు నమోదు చేసారు. ఐటీసీలో పనిచేసే రాము అనే వ్యక్తి తన కూతురు ను మైనర్ బాలికను కాలుతో తన్నుతు భయభ్రాంతులకు గురి చేయగా కూతురు 1098 చేల్డ్ హెల్ప్ లైన్ కి ఫిర్యాదు చేసింది. ఐసిడిఎస్ సూపర్వైజర్ సక్కుబాయి విచారణ చేపట్టి బాలిక తండ్రి పై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయించారు.

# బొగ్గు ఉత్పత్తి నిలిపివేత

సత్తుపల్లి :

ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో గత రాత్రి నుండి హోరెత్తుతున్న వర్షం తో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పనులకు ఆటంకం ఏర్పడింది.వర్ష ప్రభావం వల్ల సత్తుపల్లి పరిధిలోని సింగరేణి జే.వి.ఆర్, కిస్టారం ఓసి లలోకి నీరు చేరి బొగ్గు ఉత్పత్తి పనులకు ఆటంకం ఏర్పడింది ఓసి లోకి నీరు చేరి రోడ్లు జలమయ్యమవ్వడం తో సింగరేణిలో బొగ్గు పనులను నిలిపివేశారు జే.వీ.ఆర్, కిస్టారం ఓసి లలో వర్షపాతం 13 ఎఎ నమోదవడంతో 195000 క్యూబిక్ మీటర్లు మట్టి తవ్వకానికి, 28000 టన్నుల బొగ్గు ఉత్పత్తి ఆటంకం ఏర్పడిందని తిరిగి పనులు ప్రారంబించేది తెలియజేస్తామన్నారు అధికారులు

# మల్లారెడ్డి అదిరిపోయే స్కెచ్

హైదరాబాద్, జూలై 23, (

తెలంగాణ పాలిటిక్స్ లో మల్లారెడ్డి ప్రత్యేక స్టయిల్. విద్యాసంస్థల అధిపతిగా ఆయన కోట్లు సంపాదించినా లభించని తృప్తి రాజకీయాల్లో కేవలం పదేళ్లలోనే రుచి చూశారు. పాల వ్యాపారం నుంచి ప్రారంభమైన మల్లారెడ్డి జీవితం కోటీశ్వరుడిగా మారడానికి విద్యాసంస్థలే కారణం. ఒక్కొక్క మెట్టు పేర్చుకుంటూ మల్లారెడ్డి రాజకీయాల్లోనూ అడుగులు వేస్తున్నారు. 2014 ఎన్నికల్లో రాజకీయాల్లోకి వచ్చి తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యుడిగా మల్కాజ్ గిరి నుంచి పోటీ చేసి విజయం సాధించిన మల్లారెడ్డి తర్వాత రూటు మార్చి బీఆర్ఎస్ లో చేరారు. తర్వాత 2018 ఎన్నికల్లో శాసనసభ్యుడిగా గెలిచిన కేసీఆర్ మంత్రివర్గంలో మంత్రి కూడా అయి ఆయన కలను నెరవేర్చుకున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఆయనకు కష్టాలు మొదలయ్యాయి. విద్యాసంస్థలు ఆక్రమిత స్థలంలో నిర్మించారని కొన్ని కూల్చివేతలు జరిగాయి. దీంతో బీఆర్ఎస్ లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలవడంతో ఆదాయపు పన్ను శాఖ దాడులు కూడా జరిగాయి. దీంతో మల్లారెడ్డి తొలినాళ్లలో మాస్ మల్లన్నగా ఉన్నా.. తర్వాత కొంత నెమ్మదించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో మంచిగా ఉంటూ తన వ్యాపారాలను, విద్యాసంస్థలకు ఇబ్బంది కలగకుండా చూసుకుంటున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సవాళ్లు చేసిన మల్లన్న తర్వాత చల్లబడి ఇప్పుడు తన



నియోజకవర్గానికే పరిమితమయ్యారు. అసలు రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానంటూ మదనపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలాంటి మల్లన్న రాజకీయాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను ఎదుర్కొనడానికి పెద్ద స్కెచ్ వేసినట్లు తెలిసింది. తాను బీఆర్ఎస్ లో ఎమ్మెల్యేగా ఉన్నాడు. తన అల్లుడు మర్రి రాజశేఖర్ కూడా ఎమ్మెల్యేగా ఉన్నాడు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. అయితే తన కోడలిని బీజేపీలోకి పంపేందుకు సిద్ధమయినట్లు కనపడుతుంది. మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ తో కనిపించడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.కేంద్ర మంత్రి బండి సంజయ్ తో భేటీ వెనక మతలబు ఏంటన్న చర్చ జరుగుతుంది. బీజేపీలో ఉంటే కొంత సేఫ్ అని భావించి ప్రీతిరెడ్డిని బీజేపీలో చేర్పించే ప్రయత్నించేందుకు ప్రయత్నిస్తున్నారన్న టాక్ వినపడుతుంది. ఆదాయపు పన్ను దాడుల నుంచి కాకుండా తన విద్యా సంస్థలను కాపాడుకోవడానికే కోడలిని బీజేపీలోకి పంపే ప్రయత్నాన్ని మల్లన్న చేస్తున్నారన్న టాక్ వినపడుతుంది. కొన్ని ఫ్లెక్సీలు కూడా ఇందుకు కారణమవుతున్నాయి. మరొక వాదన కూడా వినపడుతుంది. బండి సంజయ్ కు, ఈటల రాజేందర్ కు పొసగకపోతుండటంతో మల్కాజ్ గిరి పార్లమెంటు నుంచి వచ్చే ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేయడానికి మల్లారెడ్డి ఇలా ప్లాన్ చేశారా? అన్న చర్చ కూడా జరుగుతుంది. రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు. సొంత పార్టీలో ఉన్న తమ ప్రత్యర్థికి చెక్ పెట్టడానికి అన్ని రకాల వ్యూహాలు పన్నుతారు. బండి సంజయ్ కూడా అదే దారిలో స్నేహారెడ్డితో భేటీ అయ్యారని కూడా అంటున్నారు. అయితే బండి సంజయ్ తో భేటీ మార్యాదపూర్వకమేనని చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకం



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 23:హుజూర్ నగర్ మండలంలోని బూరుగడ్డ శ్రీ ఆది వరాహలక్ష్మి నరసింహ వేణుగోపాల స్వామి దివ్య క్షేత్రములో క్షేత్రపాలకుడు శ్రీ ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకము, 108 తమల పాకులచే ఆకుపూజ,గంధ సింధూరము, పానకం, వడపప్పు, పండ్లు, నారికేళము, పులిహోర, వడమాల,ప్రసాద నివేదనలతో పూలదండ అలంకరణ సహిత పూజా కార్యక్రమమును గింజల నరేందర్ రెడ్డి వాసంతి దంపతులు, పురం నాగరాజు లు చేయించారు. ఈ కార్యక్రమంలోఆలయ చైర్మన్ యరగాని గురవయ్య,ధర్మకర్తలు గంధం అంజయ్య,తిపిరిశెట్టి హరీష్ కుమార్, వేముల నరసింహారావు కోలా కృష్ణ ప్రసాద్,పెనుబేల్లి హనుమంతరావు, మేరిగా కవిత, మరియు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణ రావు, ఆలయ అర్చకులు ముడుంబై హరీష్ కుమారా చార్యులు,పి శ్రీనివాసచార్యులు మరియు సురభి సైదులు,చిన్ను శ్రీనివాసరెడ్డి,సారెడ్డి వీరారెడ్డి,నీలా సాయికుమార్,పేరబోయిన వీరయ్య, గార్లపాటి భరత్ చంద్ర, ఊటుకూరి బోనచంద్ర,వాసంతి,వీణ,విజయలక్ష్మి, సాయి ప్రసన్న, యామిని,సరస్వతి, మరియు ఆలయ సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరం:జిల్లా జడ్జి లక్ష్మి శారద




సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 23:లింగ నిర్ధారణ చేయటం చట్ట రీత్యా నేరమని అది ఎవరు చేసినా ఎవరు సహకరించినా చట్టరీత్యా తీవ్ర పరిణామాలకి గురి కావాల్సి వస్తుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. కలెక్టర్ ఛాంబర్ నందు నిర్వహించిన డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ ఆథారిటి కమిటీలో జిల్లా జడ్జి లక్ష్మి శారద, జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పి సి పి ఎన్ డి టి చట్టం, క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ల ప్రకారం అర్హత లేని వారు హాస్పిటల్స్, డయాగ్నస్టిక్ సెంటర్ లు నిర్వహించరాదని ఆదేశించారు. వైద్య అధికారులు తనిఖీ లు చేసినప్పుడు అర్హత లేని వారు నిర్వహిస్తే ఆ సెంటర్ అనుమతి రద్దు చేయాలని అలాగే ఎక్విప్మెంట్ సీజ్ చేయాలని సూచించారు.జిల్లాలో 44 స్కాన్ సెంటర్ లు పని చేస్తున్నాయని, అర్హత లేకుండా నిర్వహిస్తున్న మూడు స్కాన్ సెంటర్ లను సీజ్ చేయటం జరిగిందని వారిని చట్టం ప్రకారం కోర్ట్ కి అప్పగించాలని ఆదేశాలు ఇవ్వటం జరిగింది.క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ప్రకారం బిల్డింగ్ అనుమతులు, ఫైర్ డిపార్ట్మెంట్ అనుమతులు ఉన్న వాటికే హాస్పిటల్ కి అనుమతి ఇవ్వాలని, ధరల పట్టిక ప్రతి హాస్పిటల్ లో అలాగే డయాగ్నస్టిక్ కేంద్రాలలో ప్రదర్శించాలని సూచించారు.ప్రైవేట్ హాస్పిటల్ లో జన్మించిన వివరాలు హెచ్ ఎం ఐ ఎస్ పోర్టల్ లో ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయాలని సూచించారు.జిల్లా జడ్జి లక్ష్మి శారద మాట్లాడుతూ గర్భస్రావం చేస్తున్నా హాస్పిటల్స్ లను, లింగ నిర్ధారణ చేస్తున్నా స్కానింగ్ సెంటర్ లను అధికారులు గుర్తించి వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని పి సి పి ఎన్ డి టి యాక్ట్ పై ప్రజలకి లీగల్ అవేర్నెస్ కల్పిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డి ఎం హెచ్ ఓ పి చంద్రశేఖర్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ జి, పి ఓ డి ఆర్ ఎ చంద్రశేఖర్, పి ఓ పి సి పి ఎన్ డి టి నాజియా, ఐ ఎం ఎ మెంబర్ ఆనంద్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకి వెళ్లొద్దు

ములుగు ఈ నెల 26 వరకు భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలుపడంతో గోదావరి నది ప్రవాహం ఎక్కువగా ఉండటం వలన ఏటూరునాగారం సబ్ డివిజన్ పరిధిలోని మత్స్యకారులు ఎవరు కూడా గోదావరి నది మరియు జంపన్న వాగు లోకి చేపలు పట్టుటకు వెళ్ళకూడదని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. సామాన్య ప్రజానీకం కూడా గోదావరి నది వెంబడి ప్రయాణించరాదని హెచ్చరించారు,గ్రామాలు ఏవైనా ముంపు గురి అయిన లేదా గ్రామాల్లోకి వరద నీరు వచ్చినట్లయితే ప్రజలు స్థానిక పోలీస్ లకు సమాచారాన్ని ఇచ్చినట్లయితే వెంటనే సహాయం చేయడానికి పోలీసులు వస్తారని అన్నారు.వెంకటాపురం మండల కేంద్రం నుండి చర్ల వైపు పోవు రహదారి, యాకన్నగూడెం దగ్గర రవాణా కు అంతరాయము ఏర్పడింది కావున ప్రత్యమ్నాయ మార్గంలో వెళ్లాలని ఏఎస్పీ తెలిపారు.

# భారత విప్లవ వీర సింహం 'ఆజాద్ చంద్ర శేఖర్'


**చంద్రశేఖర్ ఆజాద్ 119వ జయంతి సందర్భంగా....**


**-దృఢ కాయము వాడు**

**-తేజోమయ మోమువాడు**

**-భారత విప్లవ వీరుడతడు**

**-ఆజాదు చంద్రశేఖరుడు**





(భారత శక్తి ప్రత్యేక ప్రతినిధి, జూలై 23:) భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో అనేక రణగొణ ధ్వనుల మధ్య ముష్టేత్తుకుని నకిలీ దేశ భక్తుల ఆర్తనాధాల మధ్య "మై అజాద్ హూ..ఆజాద్ హీ రహుంగా..." అని సింహ గర్జన చేసి సంఘటనా శాస్త్రంలో భారతీయులందరికీ ముఖ్యంగా యువకులకు నిరంతరం ఎంతో స్ఫూర్తిదాయకమై తన విప్లవ సాకార తేజః పుంజముల చేత యువకుల నెందరినో విప్లవోన్ముఖులుగా తీర్చిదిద్దిన భారత విప్లవ రథ సారథి, భారత విప్లవ వీర సింహం చంద్రశేఖర్ ఆజాద్.

:: జననం-బాల్యం ::

సత్యం, నియమం, నిష్ఠ, స్పష్టమైన మాటలు, స్వాభిమానం, నిజాయితీ, ధార్మిక చింతన, దేశభక్తి వంటి ధీరోదాత్త గుణాలకు 'గని' వంటిదైన తివారి వంశంలో శ్రావణ శుద్ధ విదియ సోమవారం 1906 జూలై 23వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు సీతారాం తివారి, జగరాణీ దేవి పుణ్య దంపతులకు నోముల పంటగా, నిరంతర బానిస బంధనాలలో నలిగిపోతున్న భరతజాతిని తట్టి మేలుకొల్పి చైతన్యవంతులను చేసే ఆశాకిరణంగా అవతరించాడు చంద్రశేఖర తివారి.

:: 'ఆజాద్' గా చిరస్మరణీయుడు ::

1921వ సంవత్సరంలో సహాయ నిరాకరణ ఉద్యమంలో 14 ఏళ్ల వయస్సు కలిగిన చంద్రశేఖర తివారి పోలీసులకు పట్టుబడి కాశి న్యాయాధిపతి అడిగిన మూడు ప్రశ్నలకు నిర్భయంగా 'ఆజాద్' (స్వేచ్ఛ) అనే సమాధానంతో అటు కాశీ న్యాయాధిపతిని ఇటు యావత్ భారతావనిని ఆశ్చర్య చకితుల్ని చేశాడు చంద్రశేఖర్ తివారి ఆరోజు నుండి 'చంద్రశేఖర ఆజాద్' గా దేశ ప్రజలందరి చేత పిలవబడ్డాడు. అప్పటినుండి ఆజాద్ గానీ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచాడు.

:: క్విక్ సిల్వర్ (పాదరసం) ::

ఆజాద్ తన శరీరాన్ని బల సంపన్నంగా ఉంచుకోవడానికి నిరంతరం ఎంతో జాగ్రత్త పడేవాడు. ఏ కార్యక్రమం తప్పిన నిత్య వ్యాయామం మాత్రం తపించేవాడు కాదు. దండీలు, బస్కీలు అతనికి ఉదయపు అల్పాహారం లాంటివి. పాలకు అతనికి విడదీయరాని బంధం. అందుకేనేమో అతని శరీరం ఎప్పుడూ మేలిమి బంగారంలా, మిలమిలలాడేది. వజ్ర కాఠిన్యం లాంటి శరీరంతో కుసుమ కోమలమైన మనసుతో పాదరసం లాంటి చురుకుదనంతో వ్యవహరించేవాడు. అందుకే అతని మిత్రులు 'క్విక్ సిల్వర్' అని పిలిచేవారు.

:: ఆంగ్లేయుల పాలిట సింహ స్వప్నం ::

సహాయ నిరాకరణ ఉద్యమం ఆజాద్ లో దాగివున్న విప్లవవాదిని మేల్కొలిపింది. ఎలాగైనా సరే భారతదేశాన్ని ఆంగ్లేయుల కబంధహస్తాల నుంచి విడిపించాల్సిందేనని ఆయన బలంగా నిశ్చయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఆయన 'హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్' అనే సంస్థను స్థాపించాడు. భగత్ సింగ్, సుఖ్ దేవ్ తదితరులకు మార్గ నిర్దేశకుడిగా మారిపోయాడు. ఆజాద్ 1926 లో కకోరి ట్రైన్ దోపిడీ, అదే సంవత్సరంలో వైస్రాయి రైలును తగలబెట్టడం, లాలా లజపతిరాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగ తీర్చుకోవడానికి 1928వ సంవత్సరంలో లాహోర్లో జేపీ సాండర్స్ ను కాల్చి వేయడం తదితర హింసాత్మక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నాడు. ఒకానొక దశలో అజాద్ ఆంగ్లేయ ప్రభుత్వానికి సింహం స్వప్నం లా నిలిచాడు. పోలీసుల హిట్ లిస్టును తయారు చేసుకున్న ఆయన, వారిని చంపే దాకా వదిలిపెట్టలేదు. 14 ఏళ్ల ప్రయాణంలో అరెస్టు అయిన తర్వాత బయటికి వచ్చి పోరాటంలో పాలుపంచుకున్న అజాద్ ఆ తర్వాత తన మరణం దాకా కూడా చిక్కడు దొరకడు లా మారి పోలీసులను ముప్పు తిప్పలుపెట్టి వారి పాలిట సింహస్వప్నం గా మారాడు.

:: తనను తాను కాల్చుకున్న అసమాన బలిదానం ::

1919లో అమృత్సర్ జలియన్వాలాబాగ్ లో శ్రీరామనవమి రోజున జరిగిన నరబలికి కారకుడైన బ్రిగేడియర్ జనరల్ డయ్యర్ హత్య కేసులో, లాహోర్ కుట్ర కేసులో, వైస్రాయ్ లార్డ్ కర్జన్ హత్య కేసులో ప్రధాన పాత్ర వహించాడనే ప్రధాన నెపంతో ఆజాద్ ను సజీవంగా పోలీసులకు ఎవరైతే అప్పగిస్తారో వారికి 30 వేల రూపాయల బహుమానం ఇవ్వబడుతుందని 1930 అక్టోబర్ 19వ తేదీన ఆనాటి దుష్ట బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకటనను విన్న ఆజాద్ అనుచర గణంలో ఒకడికి డబ్బు మీద ఆశ పుట్టింది. దానితో వాడు ద్రోహిగా మారాడు. ఆ నయవంచకుని కారణంగా 1931 ఫిబ్రవరి 27వ తేదీన కలకత్తాలోని ఆల్ఫ్రెడ్ పార్కులో తన అనుచరుడైన సుఖ్ దేవ్ రాజ్ తో సైకిల్ పై విప్లవ సంస్థ భవిష్యత్ కార్యక్రమాల యోజనకు సంబంధించిన ఆలోచనలను చర్చిస్తూ వెళుతున్న సమయంలో ఆ నయవంచకుని సమాచారంతో కెప్టెన్ శంభూనాథ్ తన 80 మంది సాయుధులైన పోలీసులతో తక్షణం ఆజాద్ పై దాడి చేయగా సుఖదేవ్ రాజ్ తప్పించుకున్నాడు. ఇక ఒంటరివాడైన అజాద్ పరిస్థితిని ముందే పసిగట్టి తన రివాల్వర్తో 40 మంది పోలీసులను కాల్చి చంపాడు. మిగిలిన వారు ఆజాద్ ను చుట్టుముట్టారు. వారు ప్రయోగిస్తున్న 40 రౌండ్లు తప్పించుకొని పక్కనే ఉన్న నేరేడు పొదల్లో దాగి పోలీసులతో సుమారు 80 నిమిషాలు పోరాడినాడు. ఇక చివరకు తన రివాల్వర్ లో మిగిలిన చివరి తూటాను తన తలకు గురి పెట్టుకుని 'ధామ్' అని పేల్చుకున్నాడు. 24 ఏళ్ళ యువ కిశోరం చివరికి మరణంలో కూడా స్వేచ్ఛ 'ఆజాద్' ని పొందాడు. ఆజాద్ నిజంగా మరణించాడా..! అన్న సందేహం తో ఆ మిగిలిన 40 మంది పోలీసులు ఒక్కసారిగా 40 రౌండ్లు కాల్పులు జరిపి కానీ ఆజాద్ ను సమీపించలేకపోయారంటేనే అర్థమౌతుంది ఆజాద్ అంటే ఆంగ్ల పోలీసులకు ఎంత భయమో!అలా ఆజాద్ ఆంగ్లేయుల పాలిట సింహ స్వప్నంగా నిలిచాడు.

:: దేశభక్తిని రగిల్చిన ఆజాద్ బలిదానం ::

ఆజాద్ ను ప్రాణాలతో పట్టుకోవాలని భావించిన బ్రిటిష్ పోలీసులకు సాధ్యం కాక చివరికి అతని మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవాల్సి వచ్చింది. ఎవరైనా తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నడుచుకున్నట్లయితే ఆజాద్ కు పట్టిన గతే పడుతుందని ప్రజలకు, ఇతర పోరాట యోధులకు హెచ్చరిక జారీ చేస్తూ ఆజాద్ మృతదేహాన్ని బహిరంగ ప్రదర్శనకు ఉంచారు. అయితే ఆజాద్ బలిదానం ప్రజల్లో మరింత పట్టుదలను పెంచి, దేశభక్తిని రగిలించింది. పోరాటంలోకి ఉరికేలా ప్రోత్సహించింది. సాయిధ శక్తులు తమ ప్రాణాలు అర్పించినా అలుపెరుగని పోరాటం చేసినా ప్రధానంగా అహింసాయుత పోరాటంగా రూపుదాల్చిన భారత స్వరాజ్య ఉద్యమం బ్రిటిష్ వారి అరాచక పాలనను నిట్ట నిలువునా కూల్చివేసింది. ఆంగ్ల ప్రభుత్వ దాస్య శృంఖలాల నుంచి భరతమాత ను విడిపించి జయకేతనం ఎగురవేసింది.

:: యువతకు ఆదర్శం ఆజాద్ ::

ఆజాద్ బలిదానం వృథా కాలేదు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కాని అది సంపూర్ణ స్వాతంత్ర్యం కాదనే చెప్పాలి. అది భౌతికంగా మాత్రమే వచ్చింది. ఇంకా మనలో భావదాస్యం



పోలేదు. ముఖ్యంగా నేటి యువతీ యువకులు అనేక ప్రలోభాలకు, దురలవాట్లకు, ఆకర్షణలకు లోనై, మత్తుకు బానిసలై, కన్న తల్లిదండ్రులకు, తోటి వారికి, దేశానికి బరువై తలవొంపులు తెస్తూ ఈ భూమికే భారంగా మారడం ఎంతో బాధాకరమైన విషయం. ఈ సమయంలో భారతీయ యువత ఆజాద్ మహాశయుని జీవితంలోని సద్గుణాలను, ఆదర్శవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలి. ఆ మహానుభావుని వారసత్వాన్ని కొనసాగించాలి. శ్రేష్ఠ భారత్ నిర్మాణంలో యువత తమ వంతు పాత్రను సమర్థవంతంగా పోషించాలి. భారత మాతకు జయము.

"సాహిత్య కళా విభూషణ"
స్వర్ణ నంది పురస్కార గ్రహీత
చౌదూరి నరసింహారావు
సాహిత్య, సామాజిక విశ్లేషకులు
చరవాణి: 9705100788

# రాళ్ళవాగు ను పరిశీలించిన: జిల్లా కలెక్టర్

ములుగు జిల్లా ప్రతినిధి,జులై 23 (భారత శక్తి) : ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని రాళ్ళవాగును జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ పరిశీలించి జిల్లా, మండల స్థాయి అధికారులు



అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పనిచేసి ఏటువంటి నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.బుదవారం ములుగు జిల్లా వెంకటాపురం మండల యాకన్న గూడెం రాళ్ళ వాగు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు మరమ్మతులకు గురైన వంతెనను కలెక్టర్ దివాకర టి.ఎస్. పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎగువ కురిసిన అధిక వర్షాలతో రాళ్లవాగు సమీపంలో తాత్కాలికంగా నిర్మించిన రహదారి వరద నీటి ప్రవాహంతో కొట్టుకుపోయిందని, ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించిందని తెలిపారు. వచ్చే మూడు రోజులలో అధిక వర్షాలు పడే అవకాశం ఉందని ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాగులు, వంకలు, చెరువులు,గోదావరి ఉగ్ర రూపం దాల్చి ప్రవహించే అవకాశం ఉందని వరద నీరు చేరి రోడ్లు పై వచ్చినప్పుడు ప్రజలు, వాహనాదారులు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరం అయితే తప్ప బయట కు రావద్దని, గోదావరి ముంపు ప్రాంతాలలో ఉన్న ప్రజల సౌకర్యార్థం పునరవస కేంద్రం ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారుల ను ఆదేశించారు. వర్షాల ప్రభావంతో పురాతన కాలం నాటి శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉంటున్న వారిని పునరావస కేంద్రాలకు తరలించాలనీ అవసరమైన బోటు రెస్క్యూ టీమ్ సిద్ధం గా ఏటూరు నాగారం అందు బాటులో ఉన్నదని, గర్భిణి స్త్రీలు స్థానిక ఆసుపత్రి తరలించాలనీ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ , దోమల మందు పిచికారి చేయాలనీ గ్రామపంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, జిల్లా మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి ఏటువంటి నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సంజీవ రావు, మండల అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం గురించి సందేశం ఇచ్చిన జిల్లా కలెక్టర్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 23: తెలంగాణ రాష్ట్రములో అమలవుతున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంలో ప్రయాణించిన 200 కోట్ల మహిళా ప్రయాణికులు, సుమారు 6700 కోట్ల రూపాయలు తేది 23 జూలై 2025 నాటికి ఆదా చేసుకున్న సందర్భంలో బుధవారం కామారెడ్డి బస్సు స్టేషన్ లో జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిధిగా విచ్చేసి, మహాలక్ష్మి ఉచిత ప్రయాణం గురించి సందేశం ఇచ్చినారు. సమావేశంలో డి.ఎం, శ్రీమతి కరుణ శ్రీ



కామారెడ్డి అధ్యక్షత వహించారు. రోజు ఉచిత ప్రయాణం చేసే మహిళా ప్రయాణికులలకు బహుమతులతో పాటు శాలువాతో సన్మానించారు. స్కూల్ విద్యార్థుల చే ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేసినారు. వీటితో పాటు ఆరు స్పెషల్ టూర్ ప్యాకేజీ కర పత్రాలను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ రాజేష్ చంద్ర, ఎ ఎస్పీ కుమారీ చైతన్య రెడ్డి, ఆర్డిఓ వీణ, డిపో సూపర్వైజర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## వెనుకబడిన ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణ వ్యయం రూ.10 నుండి 20 లక్షలకు పెంపు

### టీటీడీలో 142 కాంట్రాక్ట్ డ్రైవర్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వానికి సిఫారసు

తిరుపతి జిల్లా ప్రతినిధి, జూలై 23 (భారత శక్తి ): ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయానికి విచ్చేసే భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందించేందుకు రూ.4.35 కోట్లు కేటాయించినట్లు టీటీడీ ఛైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్, ఈవో శ్రీ జె.శ్యామలరావుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ, టీటీడీ ధర్మకర్తల మండలి తీసుకున్న నిర్ణయాలను వివరించారు. వివరాలు.....

– తిరుమలలో రోజురోజుకు పెరుగుతున్న శ్రీవారి భక్తుల రద్దీకి అనుగుణంగా భవిష్యత్ అవసరాల దృష్ట్యా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ –3 నిర్మించేందుకు సాధ్యసాధ్యాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీ వేయాలని నిర్ణయం.

–తిరుమలలో భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల్లో అన్ని వసతులతో విశ్రాంతి కేంద్రాలు (లాంజ్ లు) ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని నిర్ణయం.

– అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా మౌలిక వసతులు, లైటింగ్, భద్రత, ఆధ్యాత్మిక ఆహ్లాదకర వాతవరణం పెంపొందించేందుకు నిర్ణయం.

– తిరుమలలోని శిలాతోరణం, చక్రతీర్థం ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ మరియు డీపీఆర్ రూపొందించాలని నిర్ణయం.

ౕ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు, వివిధ దేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి నిపుణుల కమిటీ నివేదిక సమర్పించింది. దీనిపై టీటీడీ ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేసి సదరు కమిటీ ఇచ్చే నివేదిక ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయం.

–శ్రీవారిసేవను మరింత విస్తృత పరిచి భక్తులకు స్వచ్ఛంద సేవను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు 4 కోఆర్డినేటర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపాదికన భర్తీ చేసేందుకు ఆమోదం.

–శ్రీవారి భక్తులు సైబర్ మోసాలకు గురికాకుండా నియంత్రించేందుకు సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటుకు ఆమోదం.

–తిరుమలలోని కళ్యాణకట్టలో భక్తులు తలనీలాలు సమర్పించేందుకు మరింత మెరుగైన సౌకర్యాలతో పాటు పారిశుద్ధ్యం, భద్రతను పెంపొందించేందుకు నిపుణులను సంప్రదించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని నిర్ణయం.

–తిరుమలలో పరిపాలన సౌలభ్యం కోసం అన్ని విభాగాలు ఒకచోట కేంద్రీకృతమయ్యేలా నూతన పరిపాలన భవనం నిర్మాణానికి ఆమోదం. అదేవిధంగా తిరుమలలో పాత బడిన హెచ్వీడీసీలోని ఆరు బ్లాకులు, బాలాజీ విశ్రాంతి గృహం, ఆంప్రో గెస్ట్ హౌస్, అన్నపూర్ణ క్యాంటీన్, కళ్యాణి సత్రాలను ఐఐటీ నిపుణుల సూచన మేరకు తొలగించాలని నిర్ణయం.

– పదకవితా పితామహుడు అన్నమయ్య జన్మించిన తాళ్లపాకలో పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం నిపుణులతో కార్యాచరణ ప్రణాళిక రూపొందిచాలని నిర్ణయం.

– సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా నిర్మించిన 320 ఆలయాలకు రూ.79.82 లక్షలతో మైక్ సెట్లను ఉచితంగా అందించాలని నిర్ణయం. ఒక్కొక్క మైక్ సెట్ ఖర్చు రూ.25 వేలు.

– వేద పరిరక్షణలో భాగంగా నిరుద్యోగులైన వేద పారాయణదారులకు దేవదాయశాఖ ద్వారా నిరుద్యోగ భృతిని చెల్లించేందుకు రూ.2.16 కోట్ల టీటీడీ నిధులు మంజూరుకు ఆమోదం.

–రాష్ట్ర దేవాదాయశాఖ సూచనల మేరకు శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించే శ్రీవారి ఆలయాలు, భజన మందిరాలకు నిధులు చెల్లించేందుకు మూడు కేటగిరీలుగా విభజన. మూడు కేటగిరీల్లో రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 లక్షలుగా నిర్ణయం తీసుకున్నాం. ఇప్పటి వరకు ఒకే కేటగిరీ కింద రూ.10 లక్షలు చెల్లించే విధానంలో మార్పు.

ౕ ఏపీ హైకోర్టు తీర్పు మేరకు టీటీడీలో కాంట్రాక్ట్ డ్రైవర్లుగా పని చేస్తున్న 142 మందిని క్రమబద్ధీకరించేందుకు ఆమోదిస్తూ ప్రభుత్వ ఆమోదానికి పంపాలని నిర్ణయం.

## ఘనంగా మీనాక్షి నటరాజన్ జన్మదిన వేడుకలు



మణుగూరు, జూలై 23 (భారతశక్తి): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ రేణుక చౌదరి క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఫైర్ బ్రాండ్ మాజీ కేంద్రమంత్రి రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి ముఖ్యఅనుచరులు గోపి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం ప్రతినిత్యం కృషి చేస్తున్న గొప్ప వ్యక్తిత్వం కలిగిన వారని కొనియాడారు. రాజకీయ నైపుణ్యం, ముందస్తు ప్రణాళికలు, విశ్లేషణలు చేస్తూ అంతరగతంగా ఉన్న కలహాలను తొలగిస్తూ పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తున్న మహిళ మణి మీనాక్షి నటరాజన్ కు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు ఇంజక్షన్లు తీసుకుంటున్న వారిపై స్పెషల్ టీంలతో నిఘా




తిరుపతి జిల్లా ప్రతినిధి, జూలై 23(భారత శక్తి):– జిల్లా ఎస్పీ ఆదేశాలతో మత్తు ఇంజక్షన్లు తీసుకుంటున్న వారిపై స్పెషల్ టీంలతో నిఘా పెట్టడం జరిగిందని తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవింద్ అన్నారు. బైరాగిపట్టెడ సమీపంలోని లింగేశ్వర నగర్ వద్ద చెట్లు పొదలలో రహస్యంగా నలుగురు యువకులు మత్తు ఇంజక్షన్ తీసుకుంటున్న దృశ్యాలు డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించడం జరిగినది. యువకులను ఈగల్ టీం, డ్రోన్ టీం సిబ్బంది పట్టుకుని తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ కు అప్పగించడం జరిగినది. లింగేశ్వర నగర్ లో నివాసం ఉండే యువకులుగా గుర్తించడం జరిగింది. యుక్తవయస్సు లో ఇలాంటి చేడు వ్యసనాలకు బానిసలుగా మారి మీ భవిష్యత్ ను మీరే పాడు చేసుకొవద్దని మత్తు ఇంజక్షన్లకు బానిసలైన యువకులకు కౌన్సిలింగ్ ఇవ్వడమైనది. యువకులకు పోలీసు వారు కౌన్సిలింగ్ ఇవ్వడం తోపాటు... వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పోలీస్ స్టేషన్ కు పిలవడం జరినది. మత్తు ఇంజక్షన్స్ తీసుకోవడం వలన జరిగే పరిణామాల గురించి తల్లిదండ్రులకు పోలీసువారు వివరించారు. అంతే కాకుండా వారిపై కేసు నమోదు చేస్తే... వారి బంగారు భవిష్యత్ మధ్య లోనే అగిపోతుందని తల్లిదండ్రులకు వివరించడమైనది. తల్లితండ్రుల అనుమతితో యువకులను వైద్యుల సూచనల మేరకు యువకులను రిహబిలేషన్ సెంటర్ కు పంపి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుంది. ఎవరైనా ఇలాంటి మత్తు పదార్థాలకు అలవాటు పెడితే తల్లిదండ్రులు భయపడకుండా పోలీసు వారి వద్దకు వస్తే రిహబిలేషన్ సెంటర్ కు పంపిస్తామని తెలియచేయడమైనది. మరోసారి ఇలాంటి వాటికి పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించటమైనది. కొందరు యవకుల వల్లన మత్తు ఇంజక్షన్ వాడటం అలవాటు చేసుకున్నామని యువకులు అంటున్నారు. ఇలాంటి ఇంజక్షన్స్ వాడటం తప్పైయిందని మరొకసారి ఇలాంటి ఇంజక్షన్లు వాడమని యువకులు అంటున్నారు. తాము ఇలాంటి మత్తు ఇంజక్షన్లు వాడి మా భవిష్యత్ పాడు చేసుకున్నామని... మరి ఎవరు ఇలాంటి మత్తు ఇంజక్షన్లు వాడవద్దని యువకులు అంటున్నారు. తిరుపతి పోలీసు వారు మత్తు ఇంజక్షన్లు వాడటం వల్ల జరిగే అనార్థల గురించి మాకు చెప్పారని మరోసారి ఇలాంటి తప్పు చేయమని యువకులు అంటున్నారు.

## మణుగూరును ముంచుతున్న ముసురు

### -ఇంకా రెండు రోజుల వరకు ఇదే పరిస్థితి.

### -వాగులు వంకలు పొంగుతూ రోడ్లన్ని జలమయం..

### -అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు.









మణుగూరు, జూలై 23 (భారతశక్తి): ఎడతెరిపి లేకుండా మంగళవారం రాత్రి నుండి కురుస్తున్న వర్షాలకు మణుగూరు పట్టణంలోని సుందరయ్య నగర్, వినాయక నగర్, శేషగిరి నగర్, బాలాజీ నగర్ జలమయమయ్యాయి. ప్రతి సంవత్సరం వానాకాలం వచ్చిందంటే ఇండ్లు, రహదారులు జలమయమై పోతున్నాయని మణుగూరు పట్టణ వాసులు వాపోతున్నారు. పట్టణంలోని కాలనీల్లో ఇళ్లలోకి వరద నీరు చేరి ఇంట్లో ఉన్న సామగ్రితో పాటు నిత్యవసరాలు తడిసిపొయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీలు, కాలువలు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రహదార్లు కూడా మోకాలోతు లో జలమయం కావడంతో వాహదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చినుకు పడితే పట్టణంలోని లోతట్టు ప్రాంత కాలనీల్లో ఏ ఒక్క రహదారి కూడా నడవడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. వర్షపు నీరు సాఫీగా బయటకు పోలేని పరిస్థితి. ప్రతి సంవత్సరం వర్షాకాలం ఇలా వచ్చిన వరదలకు డ్రైనేజీలు పొంగి రోడ్లపై వరద పారుతుంటే నడవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చిన వరదంతా బయటకు వెళ్లే మార్గం లేక ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉంటుంది. ఈ నీటిలో విపరీతమైన దోమల చేరి మలేరియా డెంగ్యూ లాంటి భయంకరమైన సీజనల్ వ్యాధులు వస్తున్నాయని అంతే కాకుండా భయంకరమైన విష సర్పాల బెడదతో భయభ్రాంతులకు గురవుతున్నామన్నారు. వరద నీరు నిల్వ ఉ ఒడడంతో మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, శిథిలావస్థకు చేరిన ఇండ్లు కూలిపోయే పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

:: బూడిద రంగులో కురిసిన వర్షం ::

మంగళవారం రాత్రి నుండి ఎడతెరపి లేకుండా వర్షం పడుతుంది. ఈ నేపథ్యంలో బుధవారం గాంధీ బొమ్మ సెంటర్, బాపనకుంట, శివలింగాపురం ఉపరితల బొగ్గగని పరిసర ప్రాంతాల్లో బూడిద రంగులో వర్షం కురిసింది. బూడిద వర్షాన్ని చూసి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరైతే బూడిద వర్షం ను వింతగా చూస్తున్నారు. చాలా మంది బూడిద కలర్ లో కురుస్తున్న వర్షాన్ని సెల్ ఫోన్లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వచ్చిన ఫోటోలు జిల్లా వ్యాప్తంగా హల్చల్ చేస్తున్నాయి. బూడిద వర్షం పడడానికి కారణం ఏమిటని ఆసక్తికర చర్చ మండలంలో జరుగుతుంది.

:: అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు.::

నైరుతి రుతుపవనాలు వలన రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని ప్రజలు ఎవరూ బయటకు రావద్దని మండల అధికారులు ఎంపీడీఓ, శ్రీనివాసరావు, తహాశీల్దార్ నరేష్, మణుగూరు సిఐ నాగబాబు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ లు అప్రమత్తం చేస్తున్నారు. అదేవిధంగా మంగళవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కాలువలు, వాగులు, వంకలు ఉధృతంగా పొంగిపొర్లుతున్నాయని అత్యవసరమైతే కంట్రోల్ రూమ్స్ కు ఫోన్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి ముందస్తు చర్యల్లో భాగంగా సహాయక చర్యల్లో భాగంగా ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అప్రమత్తం చేశారు. బుధవారం ఉదయం భద్రాచలం ఆర్డీవో దామోదర్ మణుగూరు పట్టణంలోని వరద ముంపుకు గురైన సుందరయ్య నగర్ లో స్థానిక మండల అధికారులతో కలిసి పర్యటించారు. వరద నీరు నిల్వలు ఉండడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి : జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సంగ్వాన్







(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 23: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని యోగ భవన్ ఆవరణలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లా కలెక్టర్ పాల్గొని చెట్లు నాటారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి యోగ పోటీలలో గోల్డ్ మెడల్స్ సాధించిన రెడ్డి పెట్ తాండా జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి గంగావత్ సందీప్, స్పోర్ట్స్ కోటాలో బాసర ట్రిబుల్ ఐటీ లో సీటు సాధించడం జరిగిన సందర్భంగా జిల్లా కలెక్టర్ సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగ పరిషత్ అధ్యక్షులు గురూజీ రామ్ రెడ్డి, కార్యదర్శి రఘుకుమార్, సురేందర్, వెంకటేశం, సిద్దా గౌడ్, ఎల్లయ్య, రాజు, హిమబిందు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## జలగలంచ, గుండ్ల వాగల వరదలను పరిశీలించిన మంత్రి



ములుగు జిల్లా ప్రతినిధి, జులై 23 (భారతశక్తి) : ములుగు జిల్లాలోని గోవిందరావుపేట మండలం పస్రా తాడువాయి మధ్యలో ఉన్న జలగలంచ గుండ్ల వాగుల ద్వారా వచ్చే వరద ఉధృతిని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పరిశీలించి ములుగు, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్లు,

ఎస్పీలకు భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

గ్రామ కార్యదర్శులు తమ తమ గ్రామాలలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి వెంటనే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా ఏర్పాట్లు చేయాలని,

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచాలన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ

రాష్ట్ర వ్యాప్తంగా విరివిగా వర్షాలు కురుస్తున్నాయని,అదే విధంగా ములుగు జిల్లాలో భారీ వర్షాలు నిన్నటి నుండి కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మంత్రి ప్రజలకు సూచించారు.

జిల్లా అధికార యంత్రాంగం భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని, జిల్లా ప్రజలకు అందుబాటులో ములుగు కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలకు ఏమైనా సందేహాలుంటే కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ 18004257109 కు కాల్ చేయాలని సీతక్క ప్రజలను కోరారు.

రైతులు ముఖ్యంగా విద్యుత్తు షాక్ ప్రమాదాల గురి కాకుండా జాగ్రతగా ఉండాలని వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయని, జాలరులు చేపల వేటకు వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అదే విధంగా గ్రామాలలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను అధికారులు గుర్తించి వారిని సురక్షిత ప్రాంతానికి తరలించే విధంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ లు కింది స్థాయి అధికారులతో ఇప్పటికప్పుడు మానేటరింగ్ చేయాలని మంత్రి సూచించారు.

ఈ కార్యక్రమములో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షం హెచ్చరిక జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశాలు జారీ

భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జూలై 23: నిర్మల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని ఉత్తర జిల్లాల్లో వాతావరణ శాఖ విడుదల చేసిన హెచ్చరికలను పరిగణనలోకి తీసుకొని, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది తక్షణమే అప్రమత్తంగా ఉండాలని, ప్రాథమికంగా వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సామాజిక భద్రతను



కాపాడేందుకు, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజల రక్షణకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టాలని, అవసరమైతే చెరువులు, వాగులు, వంతెనల వద్ద ఎరుపు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

వర్షం వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేయడం, ఆపదలో ఉన్నవారిని వెంటనే గుర్తించి సహాయ చర్యలు చేపట్టడం, రహదారులపై ట్రాఫిక్ నియంత్రణ, మరియు వాహనదారులకు సూచనలు ఇవ్వడం వంటి బాధ్యతలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.

అంతేగాక, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులు,సిబ్బంది 24/7 అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలు పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని పోలీస్ విభాగాల మధ్య సమన్వయం పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. వ్యవసాయ పనులోకి వెళ్ళే రైతులు గానీ, ఇతరులు గానీ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అవసరమైన పనులు ఉంటే మాత్రమే ప్రజలు బయటికి వెళ్ళాలి అని సూచించారు.

# నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలి.

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి,

పంటలకు నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం నానో యూరియా వినియోగం, ఎరువులు సక్రమ సరఫరాపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ, సహకార సంఘాల సీఈఓలు, ఇన్పుట్ డీలర్లు తో ఐడిఓసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రైతుల భద్రత, శాస్త్రీయ పద్ధతుల్లో సాగుకు ప్రోత్సాహం కల్పించే క్రమంలో నానో యూరియా వినియోగం పై విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులతో పాటు సహకార సంఘాల సీఈఓలను ఆదేశించారు. నానో యూరియా వాడకం వల్ల మొక్కల పెరుగుదల బాగా ఉంటుందని, కావాల్సిన పోషకాలు అందడంతో పాటు శక్తి పర్యావరణహితమైనదని తెలిపారు. రైతులు దానివల్ల వ్యయాన్ని తగ్గించుకొని అధిక దిగుబడి సాధించగలరని వివరించారు. ప్రతి మండలంలో వ్యవసాయ అధికారులు, ఉద్యాన, సహకార సంఘాల సీఈవోలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఫీల్డ్ డెమో, గ్రామ సభల ద్వారా నానో యూరియా ప్రయోజనాలు రైతులకు తెలియజేయాలని సూచించారు. పురాతన విధానాలను మరిచి శాస్త్రీయ పద్ధతులను అవలంబించడమే రైతులకు మేలు చేస్తుందని, అందుకే ప్రతి రైతుకు ఈ సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డీలర్లు ప్రతి రోజు ఎరువులు నిల్వలు స్టాకు బోర్డులో వ్రాయాలని తెలిపారు.యూరియా వ్యవసాయానికి కాకుండా ఇతర పనులకు మళ్లీస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. రైతులను. ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎరువులకు ఎలాంటి కొరత లేదని సమృద్ధిగా నిల్వలు ఉన్నాయని రైతులు అపోహపడొద్దని తెలిపారు.

# వరద నీరు నిల్వకుండా, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సత్వర చర్యలు చేపట్టాలి.

### %-%నగరంలోని వరద ముప్పు ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్ర పర్యటన, అధికారులకు సూచనలు



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి,జులై 23:గ్రేటర్ హైదరాబాద్ నగరంలో వర్షపు నీరు నిలుస్తూ తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న ప్రాంతాలను గుర్తించి వెంటనే క్లియర్ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీ ఆర్.వి. కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీ ఆర్.వి. కర్ణన్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ గజరావు భూపాల్, జోనల్ కమిషనర్ (సెరిలింగంపల్లి జోన్) శ్రీ భోర?డే హేమంత్ సహదేవరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ , సిబ్బందితో కలిసి సెరిలింగంపల్లి జోన్ లో క్షేత్ర పరిశీలన చేశారు.మెడికవర్ హాస్పిటల్ సమీపంలోని జూబ్లీ ఎన్‌క్లేవ్ కమాన్ వద్ద వరద నీటి డ్రైనేజీని కమిషనర్ పరిశీలించారు.ఆ తర్వాత, శిల్పరామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట లేక్స్ ఔట్‌లెట్ పాయింట్‌ను సందర్శించారు.తదుపరి, హై-టెక్ సిటీలోని యశోద హాస్పిటల్ రోడ్డుపై స్మైలైన్ డెంటల్ వద్ద నీటి నిల్వ పాయింట్‌ను పరిశీలించారు.స్మైలైన్ డెంటల్ హాస్పిటల్ వద్ద యశోద రోడ్డుపై తుఫాను నీటి డ్రైన్ నిర్మించాలని, తమ్మిడికుంట సరస్సు వద్ద హైడ్రా చేత పడవేయబడిన వ్యర్థాలను తొలగించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.వర్షం పడినప్పుడు వరదతో పాటు పెద్దమొత్తంలో చేరుతున్న సిల్ట్ ను వెనువెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు.అనునిత్యం అప్రమత్తంగా ఉండి వరద నివారణతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

# 40పరవళ్లు తొక్కుతున్న బొగత జలపాతం

ములుగు రాష్ట్రంలోని ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన తెలంగాణ నయాగరా గా పేరు గాంచిన బొగత జలపాతాల్లో వరద ఉధృతితో నీటి ప్రవాహం భారీగా పెరిగింది. పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో జలపాతాలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో జలపాతాల వద్ద సందర్శకుల రాకను అధికారులు తాత్కాలికంగా నిషేధించారు.వర్షాల ధాటికి జలపాతాల వద్ద నీటి ప్రవాహం అత్యంత వేగంగా సాగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాణాపాయం ఉన్నందున ప్రయాణికులు, పర్యాటకులు జలపాతాల వైపు రాకూడదని అధికారులు హెచ్చరించారు.పోలీసులు, అటవీశాఖ, పర్యాటకశాఖ అధికారులు అక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. బారికేడ్లు ఏర్పాటు చేసి సందర్శకుల ప్రవేశాన్ని పూర్తిగా ఆపివేశారు.

# డబ్బుకోసమే వృద్ధుని హత్య

## -కత్తితో గొంతు కోసి ఘాతుకం నిందితుడి అరెస్ట్.

## - కేసు వివరాలు వెల్లడించిన బైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్.

భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జూలై 23: నిర్మల్ జిల్లా కుబీర్ మండలం చాత గ్రామంలో ఈ నెల 17న బలరాం గౌడ్ అనే వృద్ధుడు హత్యకు గురికాగా, ఇవాళ ఈ మర్డర్ కేసు వివరాలను ఏఎస్పీ అవినాశ్ కుమార్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వృద్ధుని కుటుంబీకులు, బంధువుల శుభకార్యం నిమిత్తం వేములవా డకి వెళ్లగా బలరాం గౌడ్ బట్టి వ్యాపారాన్ని చూసుకుంటూ ఇంటివద్దే ఉండిపోయాడు. చాత్త గ్రామంలో కూలీగా పనిచేసుకుంటున్న సిల్మల సంతోష్ డబ్బుల కోసం ఈ నెల 17 అర్ధరాత్రి కత్తితో వృద్ధుడిని దారుణంగా గొంతు కోసి హత్య చేశాడు.

లక్ష యాభై వేల రూపాయలు తీసుకుని పరారయ్యాడు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ఈ ఘటనలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుని అదుపులోకి తీసుకున్నారనీ పేర్కొన్నారు. నిందితుని నిందితున్ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి లక్ష యాభై వేల రూపాయలతోపాటు రెండు కత్తులు, గొడ్డలి, సెల్ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్కు తరలిస్తున్నట్లు వెల్లడించారు.నిర్మల్ జిల్లా కుబీర్ మండలం చాత గ్రామంలో చోటు చేసుకున్న వృద్ధుడి హత్య కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జూలై 17 అర్ధరాత్రి బలరాం గౌడ్ అనే వృద్ధుడు రక్తపుమడుగులో మరణించి ఉన్న ఘటనపై బుధవారం ఏఎస్పీ అవినాష్ కుమార్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కీలక విషయాలు వెల్లడించారు.వృద్ధుని కుటుంబ సభ్యులు, బంధువుల శుభకార్యానికి వేములవాడ వెళ్లగా, బలరాం గౌడ్ తన బట్టి వ్యాపారం నిమిత్తం



ఇంటివద్దే ఉండిపోయారు. ఇదే సమయంలో, అదే గ్రామానికి చెందిన కూలీ కార్మికుడు సిల్మల సంతోష్ (45) డబ్బుల కోసం వృద్ధుడి ఇంట్లోకి చొరబడి, కత్తితో గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. అనంతరం ఇంట్లో ఉన్న రూ.1.5 లక్షలు తీసుకుని పరారయ్యాడు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాలతో పోలీసులు చురుకైన దర్యాప్తు చేపట్టారు. రూరల్ సీఐ నైలు, ఎన్హెచ్ఎ శంకర్, భైంసా సీఐ గోపీనాథ్, కుబీర్ ఎస్సై కృష్ణారెడ్డి, దిలావర్పూర్ ఎస్సై రవీందర్ ఆధ్వర్యంలోని బృందాలు క్లూ టీమ్, సెల్ సిగ్నల్, ఫింగర్ ప్రింట్, సీసీఎస్ సాంకేతిక సహకారంతో నిందితుడిని అరెస్ట్ చేశారు.నిందితుడి వద్ద హత్యకు ఉపయోగించిన చిన్న కత్తి, పెద్ద కత్తి, గొడ్డలి, మొబైల్ ఫోన్ లభ్యమయ్యాయి. అలాగే మృతుని నుండి దొంగిలించిన రూ.1.5 లక్షల నగదు కూడా పోలీసులు రికవరీ చేశారు. గతంలోనూ 2008లో నిజామాబాద్ జిల్లా బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితుడిపై కేసు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం నిందితుడిని రిమాండ్కు తరలించారు.

# ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి

## అత్యవసర విభాగంలో సిబ్బంది అందుబాటులో ఉండాలి

## సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలి.



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 23:ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చే రోగులపట్ల సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని, వారు ఏ విభాగానికి వెళ్లాలో తెలియజేసే విధంగా సిబ్బంది చెప్పే విదంగా ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ నర్సింగ్ సూపర్డెంట్ రేణుక భాయ్ కి తెలిపారు.బుధవారం మధ్యాహ్నం సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో గల మాత శిశు ఆరోగ్య కేంద్రం ను కలెక్టర్ పరిశీలించారు. వివిధ విభాగాలకు సంబంధించిన గదులను పరిశీలించారు. రోజుకి ఎంతమంది గర్భిణీ స్త్రీలు వస్తున్నారు వారిని రిజిస్టర్ లో నమోదు చేస్తున్నారా లేదా పరిశీలించారు. ఆసుపత్రి లో పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ తెలిపారు గర్భిణీ స్త్రీ తో పాటు వచ్చే అటెండెంటుకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు మెడికల్ సర్వీసెస్ చాలా బాగున్నాయని కానీ ఎం సి హెచ్ సిబ్బంది పేషెంట్ల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నారని తన దృష్టికి వచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి సంఘటనలు అయితే అట్టి వారిపై కఠిన చర్యలుతీసుకోబడతాయని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని సిబ్బందిని హెచ్చోడి వీక్షించాలని కలెక్టర్ తెలిపారు. మాత శిశు ఆరోగ్య కేంద్రానికి గర్భిణీ స్త్రీలను పరిశీలన నిమిత్తం తీసుకొని వచ్చిన గిరి నగర్ చెందిన ఆశాలు పారిజాతం, ఆదిలక్ష్మితో కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం నలుగురు గర్భిణీలను పరిశీలన నిమిత్తమై తీసుకొని రావడం జరిగిందని వారు పేర్కొన్నారు. అమ్మ పాలన సహాయ కేంద్రం వద్ద గర్భిణీల నమోదు రిజిస్టర్ను పరిశీలించారు. మఠంపల్లి మండలానికి చెందిన బక్కపల్లి గ్రామవాసి బచ్చులకూర రూప మూడవ డెలివరీ కోసం ఆసుపత్రికి రావడం జరిగిందని ఇక్కడ సిబ్బంది సేవలు చాలా బాగున్నాయని కలెక్టర్కు వివరించారు. అనంతరం గర్భిణీలవార్డును పరిశీలించారు. అక్కడ చెరుకుపల్లి గ్రామాన్నించి వచ్చిన రమాదేవి కి సాధారణ ప్రసవం జరిగిందని బాబు పుట్టాడని సంతోషంగా కలెక్టర్కు తెలిపింది.

రేపాల పిహెచ్ సి నుంచి మేక అనిత ఏడో నెల గర్భవతి జనరల్ చెకప్ కు తీసుకుని వచ్చిన ఆశలతో కలెక్టర్ మాట్లాడారు. గర్భిణీలను జనరల్ చెకప్ కు తీసుకువచ్చి ఆశాలకు అన్ని సదుపాయాల ఉన్న ఒక విశ్రాంతి గది కేటాయించాలని హెచ్ ఓ డి కి కలెక్టర్ తెలిపారు. పేషంట్లతో వచ్చిన సహాయకులకు విశ్రాంతి కొరకు తాత్కాలిక షెడ్డు నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ప్రధాన ఆసుపత్రిలోని అత్యవసర విభాగాన్ని పరిశీలించారు. ఈ విభాగంలోని సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం క్రిటికల్ కేర్ యూనిట్ ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ శ్రీకాంత్, గైనకాలజీ హెచ్ఒడి పద్మజ, నర్సింగ్ సూపర్డెంట్ రేణుక భాయ్ డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్,అంగన్వాడి కేంద్రాల్లో మెను అమలుపర్చాలి.

## ప్రాధమిక స్థాయి లోనే విద్యార్థులకి తెలుగు, ఇంగ్లీష్ బాషలపై పట్టు సాధించాలి.

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారతశక్తి) జూలై 23:ప్రభుత్వ హాస్పిటల్ లో సాధారణ ప్రసవాలు పెంచేలా వైద్య అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణం లోని అంబేద్కర్ నగర్ అర్బన్ పి హెచ్ సి, ట్రైబల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహం, అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఎన్ సి రిజిస్టర్, ఎనిమియా కేసుల వివరాలు అడిగి తెలుసు కున్నారు. ప్రసూతి ల వివరాలు వారికి అందుతున్న సేవలు గురించి ఆరా తీశారు. ఫార్మసీ స్టోర్ నందు ఉన్న డ్రగ్స్ వివరాలు అడిగి తెలుసు కున్నారు.1700 మంది హైపర్ టెన్షన్ కేసులు తమ పరిధిలో ఉన్నారు అని సిబ్బంది కలెక్టర్ కి వివరించారు.తదుపరి కలెక్టర్ ట్రైబల్ బాలుర వసతి గృహంలో ఉన్న బియ్యం, వాటర్ టాప్ లుపరిశీలించారు.విద్యార్థులను ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.అలాగే విద్యార్థులు లైబ్రరీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.అంగన్వాడీ కేంద్రంలోకి వెళ్ళి హాజరు వివరాలు పరిశీలించారు. పిల్లలు రోజు అంగన్వాడీ కి వచ్చేలా చూడాలని సూచించారు.ఈరోజు వచ్చిన పిల్లల పేర్లు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుడ్లు, బియ్యం, వంట సామాగ్రి ఈ సందర్బంగా కలెక్టర్ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మెను అమలు పర్చాలని సూచించారు.తదుపరి గవర్నమెంట్ పబ్లిక్ స్కూల్ సందర్శించి 1,2 వ తరగతి గదిలోకి వెళ్ళి విద్యార్థులచే ముచ్చటించారు. అలాగే 5 వ తరగతి గదిలో జరుగుతున్న ఇంగ్లీష్ సబ్జెక్ట్ పై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి చదివించారు. విద్యార్థులు మంచిగా చదవటంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేసిప్రాధమిక స్థాయి నుండే విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ భాష లపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ స్కూల్ హెడ్ మాస్టారు కరుణ రాణి, నవ్య, వార్డెన్ కోటేష్, అంగన్వాడీ టీచర్ పద్మ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలి.

### -ఎరువుల దుకాణాలు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జూలై 23: . నిర్మల్ జిల్లాలో రైతులకు ఎరువుల కొరత రాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ మినీ ట్యాంక్‌బండ్ సమీపంలోని గాయత్రి ఫర్టిలైజర్‌తో పాటు కొండాపూర్ గ్రామంలోని శ్రీ సాయి ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాలలో ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ప్యాకింగ్ లేబుళ్లు, తయారీదారుల వివరాలు, గడువు తేదీలు, రిజిస్టర్లు, రసీదుల పుస్తకాలను పరిశీలించారు. అన్ని రికార్డులు సరిగ్గా నిర్వహించాలని యజమానులకు సూచించారు. రైతులకు అవసరమైన పరిమాణంలో మాత్రమే ఎరువులు విక్రయించాలన్నారు. ఎరువుల కొనుగోలుకు వచ్చిన రైతులతో మాట్లాడిన కలెక్టర్, వారి సాగు చేసిన పంటలు, భూమి విస్తీర్ణం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు నకిలీ విత్తనాలు, మందులు కొనకూడదని, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు భూసారానికి అనుగుణంగా వాడాలని, అధికంగా వాడితే దిగుబడిపై ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసాయ శాఖాధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్లు రాజు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జిజేసీ)లో ఇంగ్లీష్ డిక్షనరీల పంపిణీ



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 23:సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జి జేసీ) సూర్యాపేట లో ఈరోజు అమెరికాలో ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్ట్ అయినా డాక్టర్ నాగిరెడ్డి సుమన వారి భర్త ప్రొఫెసర్ జేజల్ రెడ్డి వారి పిల్లలు అయినా ప్రఖ్యాత్ రెడ్డి ప్రసీద పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో 20వేల విలువగల 100 ఆంగ్ల డిక్షనరీలను పంపిణీ చేయడం జరిగినది. గతంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హనుమాన్ నగర్, తిలక్ నగర్ ,పిల్లలమర్రి మొదలగు పాఠశాలలో పంపిణీ చేసినారు ప్రభుత్వ పాఠశాల పిల్లలకు ఈ డిక్షనరీలు ఎంతో ఉపయోగపడతా యన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సుమన తల్లితండ్రులు నాగిరెడ్డి సుదర్శన్ రెడ్డి చల్ల అరుణ కుమారి మరియు మండల శాఖ అధ్యక్షులు దండా శ్యాంసుందర్ రెడ్డిజిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జక్కి ఆంధ్రయ్య, కర్నాటి శ్రీశైలం, సుంకరి లింగమూర్తి, అలుగువెల్లి పద్మావతి, కట్ట కృష్ణారెడ్డి, చామకూరి పద్మ, గుంటి సత్యనారాయణ, హరిత, సువర్ణ అంజమ్మ మొదలగువారు పాల్గొన్నారు .

# సైబరాబాద్ పరిధిలో సెల్ ఫోన్ రికవరీ

సైబరాబాద్

సైబరాబాద్ పరిధి లో సెల్ ఫోన్స్ పోగొట్టుకున్న వారికీ సియిర్ పోర్టల్ ద్వారా పోలీసులు సెల్ ఫోన్స్ అందించారు. సైబరాబాద్ క్రైమ్ డీసీపీ ఉత్తమ్ రెడ్డి మాట్లాడుతూ సైబరాబాద్ పరిధి లో సెల్ ఫోన్స్ పోగొట్టుకున్న వారికీ 8 వ పేస్ లో 827 ఫోన్ లు అందించాము, వీటి విలువ 2 కోట్ల రూపాయలు ఉంటుందని అన్నారు. 11000 వేల ఫోన్ లు ఇప్పటివరకు అందించాం. మాదాపూర్, బాల నగర్, మేడ్చల్, శంషాబాద్, షాద్ నగర్ సీసీ ఎస్ పరిధి లలోని సియిర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్స్ బాధితులకు సెల్ ఫోన్స్ అందించామని అన్నారు.

# టాక్ ఆఫ్ ది టౌన్‌గా 'సైయారా'.. ఈ బాలీవుడ్ మూవీలో ఏముంది?

స్టార్ నటులు లేరు. పెద్దగా ప్రచారమూ చేయలేదు. అసలు 'సైయారా' అనే సినిమా ఉందనే విషయమే చాలా మందికి తెలియదు. ఎలాంటి అంచనాలు లేకుండా ఈ నెల 18న బాక్సాఫీసు ముందుకొచ్చి, టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. మౌత్ టాక్ పవర్ ఏంటో మరోసారి రుజువు చేసింది. అసలు ఈ చిత్రంలో ఏముంది?

భావోద్వేగమే బలం..

ఇందులో భారీ ఫైట్స్ లేవు. పవర్‌ఫుల్ డైలాగ్స్ లేవు. కళ్లు చెదిరే విజువల్ ఎఫెక్ట్స్ కూడా లేవు. ఎమోషన్ మాత్రమే ఉంది. అదే సినిమాని నిలబెట్టింది. పోనీ భారతీయ సినీ చరిత్రలో ఇప్పటి వరకూ రాని ప్రేమకథా? కానే కాదు. సింపుల్ స్టోరీనే. క్రిష్ కపూర్‌కు సంగీతమంటే ప్రాణం. గొప్ప కంపోజర్ కావాలన్నది అతడి కల. ఓ సందర్భంలో క్రిష్‌ని చూసిన జర్నలిస్టు, లిరిసిస్ట్ వాణీ బాత్రా అతడిని ఇష్టపడుతుంది. ఆ పరిచయం ప్రేమగా మారుతుంది. అదే సమయంలో.. ప్రేమ పేరుతో వాణిని మోసం చేసిన మహేశ్ మళ్లీ ఆమె జీవితంలోకి వస్తాడు. అప్పటికే మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న వాణి ఎలాంటి నిర్ణయం తీసుకుంది? మహేశ్ రాకతో క్రిష్‌లో వచ్చిన మార్పేంటి? అనుకున్న లక్ష్యం చేరాడా? మహేశ్, క్రిష్‌లలో వాణి ఎవరిని వివాహం చేసుకుంది? అన్నది క్లుప్తంగా ఈ సినిమా కథాంశం.

ఇద్దరూ కొత్తేవారే అయినా..

క్రిష్, వాణి పాత్రలు. వాటిని పోషించిన అహాన్ పాండే (%ూష్ట్రుఖుఅ్రుఖుఅఖుఎ%), అనీత్ పడ్డా (%ూఅవవ్ష్ర ్రుఖుఎఖు%) ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తొలి ప్రయత్నంలోనే నటనలో పరిణతి చూపించి, కొత్తవారనే ఆలోచన రాకుండా చేశారు. అహాన్



మరెవరో కాదు.. నటుడు చంకీ పాండే సోదరుడైన చిక్కీ పాండే కుమారుడు. కొన్ని కమర్షియల్ యాడ్స్, 'సలామ్ వెంకీ' సినిమాలో నటించిన అనీత్ 'సైయారా'తో హీరోయిన్ అయింది. ఈ చిత్రానికి యాక్టర్స్‌తోపాటు సంగీతం మరో బలం. సందర్భానుసారం వచ్చే పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హృదయాన్ని హత్తుకుంటాయి. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ, మ్యూజిక్‌ను బట్టి ఈ సినిమాని కొందరు హిట్ మూవీ 'ఆషికీ 2'తో పోలుస్తున్నారు. విశేషమేంటంటే.. రెండింటినీ తెరకెక్కించింది ఒకే దర్శకుడు.. మోహిత్ సూరి మరోవైపు, ఇది ఓ కొరియన్ మూవీ రీమేక్ అన్న చర్చా జరుగుతోంది.

నాలుగు రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి..

రొమాంటిక్ చిత్రాలకు కేరాఫ్ అయిన బాలీవుడ్ మేకర్స్ కొంతకాలంగా యాక్షన్ బాట పట్టిన సంగతి తెలిసిందే. విజయం దక్కట్లేదన్నది గుర్తించినా.. మాస్ అంశాల చుట్టూనే తిరుగుతున్నారు. మోహిత్ కూడా 'ఆషికీ 2' తర్వాత వేరే సినిమాలు చేసినా ఆ స్థాయి క్రేజ్ రాలేదు. పైగా పాన్ ఇండియా ట్రెండ్ ఉండనే ఉంది. ఏదో అద్భుతం చూపిస్తేనే ఆడియన్స్ థియేటర్స్ వస్తారనే అభిప్రాయం చాలా మందిది. అందుకే 'సైయారా' ప్రారంభించిన సమయంలో.. 'ఇప్పుడు లవ్‌స్టోరీనా? పైగా కొత్తవారితో?' అంటూ పెద్ద పెద్ద దర్శక, నిర్మాతలే చిన్నచూపు చూసేవారని మోహిత్ ఓ ఇంటర్వ్యూలో అన్నారు. అందుకే ఈ సినిమాని నిర్మించేందుకు చాలామంది ముందుకు రాలేదట. తమ అనుభవంతో ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిల్మ్స్ ఈ సినిమా విజయాన్ని ముందే గుర్తించి, దర్శకుడికి అవకాశం ఇచ్చింది. విడుదలైన నాలుగు రోజుల్లోనే రూ.100 కోట్లకుపైగా వసూలు చేసి, బాలీవుడ్‌కు కొత్త కళ తీసుకొచ్చింది. కంటెంటే ముఖ్యమన్న విషయాన్ని గుర్తుచేసింది. ఉత్తరాదిలోనే కాదు దక్షిణాదిలోనూ అదే మ్యాజిక్ క్రియేట్ చేస్తోంది. మహేశ్ బాబు, సుకుమార్ లాంటి సినీ సెలబ్రిటీలు సైతం ఈ సినిమాకి ఫిదా అయ్యారు.

# ఇన్నాళ్లు ఎదురుచూసింది ఈ మార్పు కోసమే

నటీమణులు యాక్షన్ పాత్రల్ని ఎంచుకుంటూ సాహసాలు చేయడం అభినందించదగిన విషయమని అంటోంది వాణీ కపూర్. ఇటీవలే 'రైడ్ 2'తో ప్రేక్షకుల్ని పలకరించిన ఈమె.. 'మండలా మర్డర్స్' సిరీస్‌తో డిటెక్టివ్‌గా నిందితుల్ని పరుగులు పెట్టించడానికి సన్నద్ధమవుతోంది. ఈ సిరీస్‌తో వాణి తొలిసారి ఓటీటీ వేదికగా సందడి చేయనుండటం విశేషం. యశ్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ ఈ నెల 25న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా వాణి కొన్ని ఆసక్తికర సంగతులతో మన ముందుకొచ్చింది.

"ఇన్నేళ్ల నా ప్రయాణంలో ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో తెరపై ప్రేక్షకుల్ని మెప్పించాను. ఇన్నాళ్లకు నాకు ఓటీటీ వేదికగా అలరించే మంచి అవకాశం దొరికింది. సంప్రదాయ పాత్రలకు దూరంగా.. సవాలుతో కూడిన శైలిని వెతుకుతున్న సమయంలోనే 'మండలా మర్డర్స్' లాంటి అద్భుతమైన కథ నా దగ్గరికొచ్చింది. ఈ థ్రిల్లర్ కథ కోసం శారీరకంగా.. మానసికంగా చాలా కష్టపడ్డాను. ఇంతకు ముందు నేను అన్వేషించని శైలి ఇది. ఇందులో డిటెక్టివ్ పాత్రలో కనిపిస్తా. ఈ కథతో నాలోని కొత్త నటిని ప్రేక్షకులకు పరిచయం చేయనున్నా. ఇలా నాలోని కొత్త కోణాన్ని బయటికి తీసి.. సవాలు విసిరే పాత్రలంటేనే నాకు ఆసక్తి ఎక్కువ".




"మునుపటితో పోలిస్తే చిత్రపరిశ్రమలో పరిస్థితులు చాలా మారిపోయాయి. ప్రస్తుతం పరిశ్రమలో చాలా మంది నటీమణులు ఎన్నో అడ్డంకులను ఛేదిస్తూ.. బలమైన పాత్రలను పోషిస్తున్నారు. భారతీయ హీరోయిన్లు ఇప్పుడు నిర్భయంగా యాక్షన్ కథల్ని ఎంచుకుంటూ వాటిని ముందుండి నడిపిస్తున్నారు. ఈ విషయంలో సంతోషంగా ఉంది. ఈ మార్పు కోసమే ఇన్నాళ్లు ఎదురుచూశాం. ఎట్టకేలకు అది సాధ్యమైంది. భవిష్యత్తులో కూడా మహిళా ప్రాధాన్య చిత్రాల సంఖ్య పెరగాలని.. నటీమణులు యాక్షన్ సీక్వెన్స్‌తో అదరగొట్టాలని కోరుకుంటున్నా".

"ఈ డిజిటల్ యుగంలో ఓటీటీలు కూడా ప్రేక్షకుల్ని సీటు అంచున కూర్చోబెట్టే కథలతో దూసుకెళ్తున్నాయి. అంతే కాదు.. దీని వల్ల నటీనటులకు శక్తిమంతమైన ప్రాజెక్టులు లభిస్తున్నాయి. నాకు కూడా ఓటీటీ వేదికగా నటించడమంటే చాలా ఇష్టం. ఎందుకంటే ఒక నటి తన నైపుణ్యాన్ని, ప్రతిభను తెరపై చూపించడానికి ఎన్నో ముఖ్యమైన చిత్రాలను, పాత్రలను ఈ వేదిక వల్లే పొందుతుంది. ఇక థియేటర్ సినిమాల విషయానికొస్తే.. నా దృష్టిలో అవి చాలా పరిమితం. ఎందుకంటే థియేటర్లలో ఎక్కువగా హీరోలే ప్రధాన కథాంశంగా రూపొందే చిత్రాలు విడుదలవుతుంటాయి".

"నేను చాలా సన్నగా ఉంటానని..బరువు పెరిగేలా చూసుకోవాలని వింటుంటాను. కానీ నన్ను నేను ఇలానే ఇష్టపడుతున్నాను. నాలో ఏమి మార్చుకోవాలనుకోవడం లేదు. నేను చాలా ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉన్నాను. సాధారణంగా ఈ విషయాలతో నేను ఎప్పుడూ బాధపడలేదు"

"బాలీవుడ్‌లో పేరు సంపాదించడం అంత సులభం కాదు. కొత్తవారు తరచూ కఠినమైన సవాళ్లు ఎదుర్కొంటారు. నా ప్రయాణం ప్రారంభం నుంచి సజావుగా సాగలేదు. సినిమాలో ఉన్నత స్థితికి ఎదగాలనే కలలు కన్నాను. దానికి ప్రతిభ ఉండాలి అనుకునేదానిని. కానీ ప్రతిభతోపాటు అందం మరింత ముఖ్యం అని తెలుసుకున్నాను. నా కెరీర్ ప్రారంభంలోని ఓ ప్రాజెక్ట్‌లో దర్శకుడు నన్ను తిరస్కరించారు. నాకు నేరుగా చెప్పలేదు కానీ, ఆ సమాచారం నాకు ఇతర వ్యక్తుల ద్వారా తెలిసింది. ఆ చిత్రనిర్మాత సినిమాలో పాత్రకి న్యాయం చేయలేనని, నేను మిల్కీ వైట్ కాదని అన్నారు. అందుకే నాకు నేనుగా ఆ సినిమాని నుంచి తప్పుకున్నాను. ఇది చాలా కాలం క్రితం జరిగింది".

# ప్రజాసేవ చేయాలంటే రాజకీయాలే సరైన మార్గం: విజయ్ ఆంటోనీ

స్టార్ హీరోలు రాజకీయాల్లోకి వెళ్లడంపై విజయ్ ఆంటోని స్పందించారు. ప్రజాసేవకు ఆ రంగం సరైనదన్నారు. ఆయన హీరోగా తెరకెక్కుతున్న 25వ సినిమా 'భద్రకాళి' అరుణ్ ప్రభు దర్శకుడు. సెప్టెంబర్ 5న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా టీమ్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నిర్మాత సురేశ్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

'భద్రకాళి' నేపథ్యం గురించి చెబుతారా?

విజయ్ ఆంటోనీ: ఇది పొలిటికల్ ఎంటర్‌టైనర్‌గా రానుంది. అన్ని వర్గాల వారికి నచ్చుతుంది.

రెండు నెలలకు ఒక సినిమా చేస్తున్నారు. మీ శ్రమకు ప్రతిఫలం ఆశించిన స్థాయిలో దక్కుతోందా?

విజయ్ ఆంటోనీ: అన్నిటినీ డబ్బుతో కొలవలేం. ప్రేక్షకుల ప్రేమాభిమానాలు ముఖ్యం. ఆ విషయంలో నేను సంతృప్తిగా ఉన్నాను. నన్ను అన్ని భాషల్లోని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. వాళ్లకు నా కష్టం కనిపించింది కాబట్టే అభిమానం చూపిస్తున్నారు.

ఇంత ఎనర్జిటిక్‌గా ఎలా ఉండగలుగుతున్నారు?

విజయ్ ఆంటోనీ: సినిమా నాకు బాధ్యత. ఒక తల్లి తన బిడ్డలను ఎలా చూసుకుంటుందో నేను సినిమాను అలానే చూసుకుంటాను. నాకు వచ్చిన అవకాశాలను 100 శాతం ఉపయోగించుకుంటాను.

ఇది పొలిటికల్ సినిమా అంటున్నారు.. తమిళనాడు రాజకీయాలను ఇందులో చూపించారా?

విజయ్ ఆంటోనీ: రాజకీయాలు ఎక్కడైనా ఒకటే.. తమిళనాడు రాజకీయాలు, అమెరికా రాజకీయాలు అని వేరుగా ఉండవు. ఈ సినిమాకు ఏ పార్టీతోటి సంబంధం ఉండదు. కామన్ పొలిటికల్



మూవీ అంతే.

స్టార్ హీరోలు రాజకీయాల్లోకి వస్తున్నారు. దీనిపై మీ అభిప్రాయం? మీరు రాజకీయాల్లోకి వెళ్తారా?

విజయ్ ఆంటోనీ: ప్రజలకు పెద్ద ఎత్తున సేవ చేయాలంటే రాజకీయ రంగమే సరైన మార్గం. సేవ చేయాలంటే ఒకేసారి 60 మందికి చేయగలం. కానీ, రాజకీయాల్లోకి వెళ్తే ఎంతమందికైనా చేయొచ్చు. ప్రజాసేవ చేయాలనే ఆసక్తి ఉన్న వాళ్లు ఎవరైనా ఆ రంగంలోకి వెళ్లొచ్చు. కానీ నాకు రాజకీయ రంగంపై ఆసక్తి లేదు.

'పరాశక్తి' నుంచి 'భద్రకాళి'గా పేరు ఎందుకు మార్చారు?


విజయ్ ఆంటోనీ: ఆ టైటిల్ మరొకరు రిజిస్టర్ చేసుకున్నారు. వాళ్లతో చిన్న కమ్యునికేషన్ గ్యాప్ వల్ల దీని పేరు మార్చాల్సి వచ్చింది.

ఇండస్ట్రీలో ఎవరిపైన అయినా కోపం ఉందా?

విజయ్ ఆంటోనీ: నాకు ఎవరితో విరోధం లేదు. ప్రతి ఒక్కరూ మన జీవితంలోకి ఏదో నేర్పడానికే వస్తారు.

25 సినిమాల్లో నటించారు కదా. ఎలా అనిపిస్తుంది?

విజయ్ ఆంటోనీ: ఆనందంగా ఉంది. ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్నాను. ఒక నటుడికి గుర్తింపు తెచ్చుకోవడం కంటే మించినది ఏమీ ఉండదు.



# నేను 12 గంటలైనా వర్క్ చేయగలను..: విద్యాబాలన్

కొన్ని రోజులుగా చర్చనీయాంశంగా మారిన వర్కింగ్ అవర్స్ అంశంపై నటి విద్యాబాలన్ ( తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. కొత్తగా తల్లి అయిన వారికి పరిమిత పని గంటలు ఉండాలని ఆమె అన్నారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఈ విషయంపై మాట్లాడారు. దీపికా పదుకొణె ఎక్కువ పని గంటల కారణంగా ఓ భారీ ప్రాజెక్ట్‌ను వదులుకున్నట్లు వచ్చిన వార్తలపై స్పందించారు. కొత్తగా తల్లి అయిన వారికి మద్దతు ఇవ్వాలని దీనికోసం సానుభూతితో కూడిన పని సంస్కృతి అవలంబించాల్సిన అవసరం ఉందని విద్యాబాలన్ అన్నారు. "బిడ్డకు జన్మనిచ్చిన మహిళలు కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలి. వారికి బాధ్యతలు ఎక్కువ ఉంటాయి. అలాంటి వారికి అవకాశం ఇవ్వాలంటే కచ్చితంగా కొన్ని మార్పులు చేయాల్సిందే. వారికి అనువైన పని గంటలు ఉండడం చాలా ముఖ్యం. వారితో పోలిస్తే నాలాంటి వారికి బాధ్యతలు తక్కువగా ఉంటాయి కాబట్టి ఎక్కువ సమాయన్ని షూటింగ్‌లకు కేటాయించగలం. నేను 12 గంటలైనా చిత్రీకరణలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రపంచంలో ఏ ప్రాంతంలో షూటింగ్ చేసినా పాల్గొనగలను" అని విద్యాబాలన్ స్పష్టంచేశారు. ఇన్నేళ్ల కెరీర్‌లో ఎంతో ఒత్తిడికి గురైనట్లు విద్యాబాలన్ చెప్పారు. ప్రస్తుతం ఒత్తిడికి దూరంగా ఉంటూ సమయాన్ని ఆస్వాదిస్తున్నట్లు తెలిపారు. తన వద్దకు వచ్చిన స్క్రిప్ట్‌లను పరిశీలించి ఓకే చేస్తున్నట్లు చెప్పారు. రెండు సినిమాలు అంగీకరించానని త్వరలోనే వాటి వివరాలు తెలుపుతానని అన్నారు. 2005లో 'పరిణీత' సినిమాతో విద్యాబాలన్ బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. సిల్క్‌స్మిత జీవితకథ ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'ది డర్టీ పిక్చర్'తో విద్యాబాలన్‌కు మంచి గుర్తింపు వచ్చింది. చివరిగా కార్తిక్ ఆర్యన్ హీరోగా నటించిన 'భూల్ భూలయ్యా 3'లో కనిపించారు.

# మాటల యుద్ధానికి ముహూర్తం ఖరారు

మొదటి పేజీ తరువాయి
చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో చర్చకు రంగం సిద్ధమైంది. పహల్గాం ఉగ్రదాడితో ముడిపడిన పరిణామాలపై సమగ్ర చర్చ జరగాలని, తాము లేవనెత్తే ప్రశ్నలకు ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటులోనే సమాధానాలు చెప్పాలని విపక్షం గట్టిగా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రధాని బుధవారం విదేశీ పర్యటనకు వెళ్లారు. 26న తిరుగుప్రయాణం అవుతారు. విపక్షాల డిమాండ్ మేరకు ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు మొత్తంగా 16 గంటల సమయం కేటాయించాలని బుధవారం రాజ్యసభ 'సభా వ్యవహారాల సంఘం' (బీఏసీ) నిర్ణయించింది. లోక్‌సభ బీఏసీ సోమవారమే ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 28న దిగువ సభలో, మరుసటిరోజు ఎగువసభలో చర్చ ప్రారంభం కానుంది. చర్చకు మోదీ సమాధానం ఇస్తారా, లేదా అనేది ఇంకా తేలకపోయినా.. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని విదేశాలకూ మరోసారి స్పష్టంచేసేలా ఆయన మాట్లాడే అవకాశం ఉందని భాజపా సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. చర్చ సమయంలో మోదీ పార్లమెంటులో ఉండాలని తాము బీఏసీ సమావేశంలో డిమాండ్ చేశామని, ప్రభుత్వం దానికి భరోసా ఇచ్చిందని రాజ్యసభలో కాంగ్రెస్‌పక్ష ఉప నాయకుడు ప్రమోద్ తివారీ విలేకరులకు తెలిపారు. వర్షాకాల సమావేశాలు మొదలయ్యాక రాజ్యసభ బీఏసీ సమావేశం జరగడం ఇదే ప్రథమం. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ దీనికి అధ్యక్షత వహించారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక మ-ంమ్మర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చకు విపక్షాలు రాజ్యసభలో మరోసారి డిమాండ్ చేశాయి.

వాయిదా తీర్మాన నోటీసులిచ్చి.. కార్యకలాపాలను అడ్డుకున్నాయి. సభను మూడుసార్లు కొంతసేపు వాయిదా వేయాల్సి వచ్చింది. నోటీసులను తిరస్కరించి చివరకు గుర-ంవారానికి వాయిదావేశారు.

సభలో ఇలా ప్రవర్తిస్తే సహించను: ఓంబిర్లా ఎన్నిసార్లు వారిస్తున్నా సమావేశాలకు కొందరు ఎంపీలు నినాద ఫలకాలతో (ప్లకార్డులతో) వస్తుండటంపై లోక్‌సభలో స్పీకర్ ఓంబిర్లా మండిపడ్డారు. వీధుల్లో ప్రవర్తించినట్లు ఇక్కడా చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు.
బిహార్ ఓటర్ల జాబితా విషయంలో పలువురు సభ్యులు తన పీఠం వద్దకు వచ్చిమరీ ఆందోళన నిర్వహిస్తుండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ "ప్రజలు ఏ ఆశలు, ఆకాంక్షలతో మిమ్మల్ని ఎన్నుకున్నారో దానికి తగ్గట్టు మీ ప్రవర్తన ఉండాలి. ప్రజల జీవితాలను సరళతరం చేయడానికి దోహదపడేలా చర్చల్లో మీరు పాల్గొనాలి.

పార్లమెంటేరియన్లలా మీరుండాలి. సభలోకి ప్లకార్డులు తీసుకురాకూడదు. మీరు దీనిని ఇలాగే కొనసాగిస్తే నేను నిర్ణయాత్మక చర్యలు చేపట్టక తప్పదు" అని హెచ్చరించి సభను కొంతసేపు వాయిదావేశారు.
తర్వాతా పరిస్థితిలో మార్పులేక గురువారానికి వాయిదా వేశారు. వరసగా మూడోరోజూ పార్లమెంటు కార్యకలాపాలు దాదాపు స్తంభించిపోయాయి.




మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్, 23 జులై ( భారత శక్తి
: తెలంగాణలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ అత్యంత భారీ వర్ష హెచ్చరిక చేసింది. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, కొమురం భీం, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. 20 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే వీలుందని పేర్కొంది.
నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు అతి భారీ వర్ష సూచన చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ సూచించింది.



# బీసీ రిజర్వేషన్లపై భాజపాది ద్వంద్వ వైఖరి: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి
దిల్లీ: కులగణన సర్వే ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు రూపొందించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించినట్లు చెప్పారు. బిల్లు ఆమోదానికి కేంద్రంలోని విపక్ష కూటమి నేతలను కూడా కలిసి మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించినట్లు చెప్పారు. తెలంగాణలో సెప్టెంబర్‌లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని సీఎం గుర్తుచేశారు. కేంద్రం త్వరగా రిజర్వేషన్ల బిల్లును ఆమోదిస్తే.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.
"భాజపా నాయకత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోంది. ఆ పార్టీ నేతలు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో మద్దతు ఇచ్చి.. ఇప్పుడు మరో మాట మాట్లాడుతున్నారు. ముస్లింల శాతాన్ని తీసివేయాలని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారు. భాజపా పాలిత రాష్ట్రాలకు ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయం ఉంటుందా? యూపీ, గుజరాత్, మహారాష్ట్రలో ముస్లిం రిజర్వేషన్లను ఎందుకు తొలగించడం లేదు? ఆయా రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు తొలగించాకే భాజపా నేతలు తెలంగాణ గురించి మాట్లాడాలి.

మేం కల్పించే రిజర్వేషన్లలో మతం ప్రస్తావనే లేదు

కులగణన సర్వేలో వ్యక్తుల వ్యక్తిగత వివరాలను వెల్లడించలేదు. 3.99 శాతం మంది తమకు ఏ కులం లేదని చెప్పారు. స్వతంత్ర నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారమే మేం ముందుకెళ్తున్నాం. బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని కుట్ర చేస్తున్నవారే సందేహాలు లేవనెత్తుతున్నారు. కులగణన సర్వే డేటా కావాలంటే ఆయా పార్టీల ముందు, అసెంబ్లీలో ప్రవేశపెడతాం. మేం కల్పించే రిజర్వేషన్లలో మతం ప్రస్తావనే లేదు. ముస్లింల పేరుతో మరోసారి భావోద్వేగ రాజకీయాలు చేయాలని భాజపా చూస్తోంది. మూడు రైతు వ్యతిరేక చట్టాల విషయంలో ఏం జరిగిందో అందరూ చూశారు. రైతు చట్టాల రద్దు స్ఫూర్తిగా బీసీ రిజర్వేషన్ల చట్టం ఆమోదం కోసం పోరాడుతాం.

దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలి

10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో 50శాతం నిబంధన దాటిపోయింది. దాని విషయంలో అడ్డురాని నిబంధన బీసీల విషయంలో ఎందుకు వస్తోంది? ఓబీసీలకు న్యాయం చేయాలని భాజపాని కోరుతున్నా. కేంద్ర పదవుల్లో తెలంగాణకు, బీసీలకు అన్యాయం జరుగుతోంది. గతంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేతను తొలగించారు. ఇప్పటికే దత్తాత్రేయను గవర్నర్ పదవి నుంచి తొలగించారు. బీసీ అయి-ంన దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలి"అని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## రూ.69లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నాం: సీపీ సీవీ ఆనంద్

మొదటి పేజీ తరువాయి: హైదరాబాద్: నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న 9 మందిని హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కొకైన్ సరఫరా చేస్తున్న ఆరుగురు, మెఫిడ్రీన్ సరఫరా చేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 286 గ్రాముల కొకైన్, 11 గ్రాముల ఎక్స్‌టసీ, తుపాకీ, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలను సీపీ సీవీ ఆనంద్ (%జు ాఖుఅ%) వెల్లడించారు."డగ్స్ కేసులో రవివర్మ, సచిన్ అనే ఇద్దరు కీలక వ్యక్తులను పట్టుకుని వారి నుంచి ముఖ్యమైన సమాచారం సేకరించాం. రవివర్మకు ముంబయికి చెందిన ముఠాతో సంబంధాలున్నాయి. అక్కడ ఉన్న వాహిద్ అనే వ్యక్తికి విదేశాల నుంచి కొకైన్ వస్తోంది.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్, 23 జులై ( భారత శక్తి ) :
నిజానికి సైబర్ నేరాల యొక్క ప్రయోజనాలు ఏమిటి..? ఎదురయ్యే సమస్యలు ఏమిటి ఇవన్నీ చర్చించాలంటే.. సమాజం, సాంకేతికత, భద్రతపై దాని ప్రభావం గురించి కొంత అవగాహన అవసరం.. అయితే నేరంతో ముడిపడి ఉన్నప్పుడు "ప్రయోజనాలు" అనే పదం వినడానికి విచిత్రంగా అనిపిస్తుంది.. కానీ ఇది సైబర్ నేరానికి అనుగుణంగా ఎదురయ్యే మనం ఊహించని సానుకూల ఫలితాలు ఖచ్చితంగా



ఉంటాయి అంటున్నారు విశ్లేషకులు..
అసలు ఒక సైబర్ నేరం జరిగితే దాని ప్రయోజనాలు ఏమిటి..? :
సైబర్ నేరాల ప్రభావం ఎక్కువుగా ఎదురైనప్పుడు వాటిని నివారించడాని సైబర్ భద్రతా టెక్నాలజీ, మిగతా పద్ధతులలో సరికొత్త కోణాలను ఆవిష్కరించడానికి అవకాశం కలుగుతుంది.. వ్యాపారాలు, ప్రభుత్వాలు డేటాతో పాటు తమ తమ నెట్‌వర్క్‌లను భద్రపరచడంలో ఎక్కువుగా ప్రాధాన్యత ఇస్తాయి.. సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి అధిక మె-ంత్తంలో వెచ్చిస్తాయి.. అత్యంత జాగ్రత్తగా వ్యవహరించడానికి సుముఖంగా ఉంటాయి.. దీనివల్ల మరింత అధునాతనమైన భద్రతా సాధనాలు, ప్రోటోకాల్‌ల అభివృద్ధికి ఈ సైబర్ నేర పరిస్థితులు దారితీస్తాయి.. ఎలాంటి సైబర్ సమస్యలు లేవు అనుకున్నప్పుడు ప్రతి ఒక్కరిలో ఉదాశీనత చోటు చేసుకుంటుంది.. దానివల్ల అభివృద్ధి కుంటుబడే అవకాశం ఉంటుంది.. అందుకే అంటారు ఒక సినిమాలో హీరో శక్తిమంతుడిగా కనిపించాలంటే విలన్ అంతకంటే శక్తిమంతుడిగా కనిపించాలి అని.. అలాగే ఒక వ్యతిరేకత ఎదురైనప్పుడు సానుకూలత బలపడుతుంది.. కష్టం ఎదురైనప్పుడు ఎలా దానిని దాటాలో తెలుస్తుంది.. అందుకే సమాజంలో ప్రతికూల వాతావరణం కూడా ఉండాలన్నది తప్పని సరి..
ఎందుకంటే సైబర్ నేరాల పెరుగుదల సైబర్ భద్రత యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహనను పెంచిందని చెప్పవచ్చు.. దీని పర్యవసానంగా.. వ్యక్తులు, సంస్థలకు సురక్షితమైన ఆన్‌లైన్ పద్ధతులపై ఎంతో ఉన్నతమైన పద్ధతులు నేర్చుకోవడానికి ఒక మార్గం చూపిందని చెప్పవచ్చు.. తమ భద్రతపై అత్యంత నైపుణ్యంతో కూడిన అవగాహన కలిగివుండే సంస్కృతిని పెంపొందించింది.
అంతే కాకుండా సైబర్ నేరాలను ఎదుర్కోవాల్సిన అవసరం, సైబర్ సెక్యూరిటీ నిపుణులకుడిమాండ్ పెరిగింది.. దీనితో సైబర్ రక్షణ, ఎలాంటి ముప్పు సంభవిస్తుంది, దానిని ఎలా ఎదుర్కోవాలి లాంటి విషయాల్లోనూ నైపుణ్యం కలిగిన వ్యక్తులకు ప్రాధాన్యత పెరిగింది.. ఈ క్రమంలో ఎన్నెన్నో ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి..
అయితే సైబర్ నేరాల ముప్పు ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలను డిజిటల్ భద్రత, గోప్యత, ముఖ్యమైన డేటా రక్షణకు సంబంధించిన బలమైన చట్టాలు, నిబంధనలను అభివృద్ధి చేయడానికి వాటిని అమలు చేయడానికి అవకాశం లభించింది.. ఆ దిశగా రాజకీయ పెద్దలు, మేధావులు ఆలోచించే దిశగా ఎంతో ప్రేరణ కలిగించింది..




సైబర్ నేరాలను అదుపుచేయడానికి అన్ని కంపెనీలు సురక్షితమైన లావాదేవీలు, పరస్పర చర్యలను నిర్ధారించడానికి వారి డిజిటల్ సేవలను ముందుకు తీసుకుని వస్తాయి.. ఆసేవలను ఎంతగానో మెరుగు పరుచుకుంటాయి.. వినియోగదారులకు మరింత సు-రక్షితమైన, సమర్థవంతమైన ఆన్‌లైన్ సదుపాయాలతో ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయి..
సైబర్ నేరాలతో ఎదురయ్యే ప్రతికూలతలు ఒకసారి చూస్తే :
ఆర్థిక నష్టాలు :
సైబర్ నేరం చేసే వ్యక్తులు, వ్యాపారస్తులకు, ప్రభుత్వాలకు గణనీయమైన ఆర్థిక నష్టాలను కలిగిస్తాయి.. ఈక్రమంలో నిధుల ప్రత్యక్ష దొంగతనం, దెబ్బతిన్న వ్యవస్థలను మరమ్మతు చేయడానికి సంబంధించిన ఖర్చులు, డౌన్‌టైమ్ కారణంగా వ్యాపారం కోల్పోవడం లాంటివి ఉంటాయి.
డేటా దొంగిలించడం :
సైబర్ నేరగాళ్లు తరచుగా వ్యక్తిగత, సున్నితమైన సమాచారానికి ఎంతో నష్టం కలిగిస్తారు.. ఇది అత్యంత కీలకమైన రహస్యాలు, ముఖ్యమైన డేటాను దుర్వినియోగం చేస్తారు.. దేశ భద్రతకు కూడా ఎంతో విఘాతం కలిగిస్తారు..
ప్రతిష్టకు తీరని నష్టం :
సైబర్ దాడులు ప్రముఖ సంస్థల ప్రతిష్టను దెబ్బతీస్తాయి.. దీని వలన వినియోగదారుల విశ్వాసం




ఆ కంపెనీలు కోల్పోతాయి.. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగం, ఫైనాన్స్ రంగం మొదలైనవి..
మౌలిక సదుపాయాలకు అంతరాయం :
రాన్సమ్‌వేర్ వంటి సైబర్ దాడులు వ్యాపారాలు, కీలకమైన మౌలిక సదుపాయాల కార్యకలాపాలకు అంతరాయం కలిగించవచ్చు.. సేవలపై ప్రభావం చూపుతాయి.. లాజిస్టికల్ సవాళ్లను కలిగిస్తాయి.
సైబర్ నేరాల నుండి సమర్థవంతంగా రక్షణ పొందడానికి వ్యక్తులు గానీ, సంస్థలు కానీ అనేక రకాల వ్యూహాలను అవలంబించవచ్చు. ప్రధానమైన ఏడూ పరిష్కారాలు ఇప్పుడు చూద్దాం :
బలమైన, ప్రత్యేకమైన పాస్‌వర్డ్‌లు, మల్టీ ఫ్యాక్టర్ అతేంటికేషన్ ఉపయోగించడం :
ఊహించడానికి కష్టతరమైన, సంక్లిష్టమైన పాస్‌వర్డ్‌లను సృష్టించి వాటిని ఉపయోగించండి.. అదేవిధంగా విభిన్న ఖాతాలకు వేర్వేరు పాస్‌వర్డ్‌లను ఉపయోగించండి. దీనితో అదనపు భద్రత చేకూరుతుంది.. ఎందుకంటే ఒక ఖాతాను మనం ఉపయోగించడానికి ఒకటి కంటే ఎక్కువ ధృవీకరణ పద్ధతులు ఎంతో అవసరం.
సాఫ్ట్‌వేర్, సిస్టమ్‌లను క్రమం తప్పకుండా కొత్తగా అప్ గ్రేడ్ చేయడం :
ఆపరేటింగ్ సిస్టమ్‌లు, యాంటీవైరస్ ప్రోగ్రామ్‌లు, అప్లికేషన్‌లతో సహా అన్ని సాఫ్ట్‌వేర్‌లను ఎప్పటికప్పుడు తాజాగా ఉంచండి. ఎందుకంటే రెగ్యులర్ అప్‌డేట్‌లలో తరచుగా సైబర్ నేరస్థులు దోపిడీ చేయగలుగుతారు..
మీదగ్గర పనిచేసే ఉద్యోగులను పూర్తిగా అర్థం చేసుకోండి :
సైబర్ భద్రతా ఉత్తమ పద్ధతులపై క్రమం తప్పకుండా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సైబర్ నేరాల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు.. ఇందులో ఫిషింగ్ ప్రయత్నాలను గుర్తించడం, సురక్షితమైన బ్రౌజింగ్ అలవాట్లు, సున్నితమైన సమాచారాన్ని సరైన పద్ధతిలో నిర్వహించేలా జాగ్రత్త వహించండి..
నెట్‌వర్క్, ఇతర పరికరాలను భద్రతపరచడం :
మీ నెట్‌వర్క్‌ను రక్షించడానికి ఫైర్‌వాల్‌లను ఉపయోగించండి. మీ యొక్క వై ఫై నెట్‌వర్క్‌లను భద్రపరచండి.. ఒకవేళ పబ్లిక్ వై ఫై ఉపయోగిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండండి. మొబైల్




పరికరాలతో సహా మీ నెట్‌వర్క్‌కు కనెక్ట్ చేయబడిన అన్ని పరికరాలు తగిన భద్రతా చర్యలతో సురక్షితంగా ఉన్నాయని నిర్ధారించుకోండి.
డేటాను క్రమం తప్పకుండా బ్యాకప్ చేయడం :
మీ డేటాను ఇన్ బిల్ట్ హార్డ్ డ్రైవ్ లో కాకుండా బయట హార్డ్ డ్రైవ్ లేదా క్లౌడ్ సర్వీస్ వంటి సురక్షితమైన చోటుకు ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా బ్యాకప్ చేసి పెట్టుకోండి.. రాన్సమ్వేర్ వంటి భయంకరమైన సైబర్ దాడి జరిగినప్పుడు, ఈ విధంగా చేసి ఉంచుకోవడం ఎంతో ఉపయోగపడుతుంది.. అంతేకాకుండా మీ డేటాను పునరుద్ధరించడానికి వీలుంటుంది..
భద్రతా సాఫ్ట్‌వేర్ ను ఉపయోగించండి :
యాంటీవైరస్, యాంటీ-మాల్వేర్, యాంటీ-స్పైవేర్ సాఫ్ట్‌వేర్‌లతో సహా సమగ్ర భద్రతా పరిష్కారాలను ఉపయోగించుకోండి. సంస్థాగత నెట్‌వర్క్‌ల కోసం ఐడీఎస్, ఐపీఎస్ వంటి అధునాతన భద్రతా సాధనాలను మాత్రమే ఉపయోగించండి.. అదే కాకుండా మీ
వ్యక్తిగత, సున్నితమైన సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్తగా ఉండండి..



ఇక ఎప్పుడైనా మీరు ఆన్‌లైన్‌లో పంచుకునే సమాచారాన్ని గుర్తుంచుకోండి. ప్రమాదకరమైన, సు-రక్షితం కానీ వెబ్‌సైట్‌లు లేదా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకుండా ఉండండి. వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారం కోసం ఎవరైనా మిమ్మల్ని సంప్రదిస్తే తొందరపడకండి.. అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండండి..

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications,
Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana .Published at Plot No.31, Road No.5,
Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy